Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు The people's Verdict తెలుగు జాతీయ దినపత్రిక

The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు ఆర్‌సి ఇన్‌చార్జిలు
• స్టాఫ్ రిపోర్టర్లు •మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 232 | హైదరాబాద్ | ఆదివారం 05 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

### 40 దేశాల నుంచి ఇంధనం సేకరించాం

### గ్యాస్ సిలిండర్ ధర 950 దాటనివ్వలేదు

### తీసుకున్న నిర్ణయాలే శ్రీరామరక్ష: మోదీ

### హెచ్‌పీసీఎల్ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టు

జైపూర్, జూలై 4: ఇరవై ఒకటో శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించామని, సంక్షోభ సమయంలో తీసుకున్న సరైన నిర్ణయాలే దేశానికి శ్రీరామరక్షగా నిలిచాయని ప్రధాని మోదీ అభివర్ణించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న

- మిగతా 2వ పేజీలో





## పాపాల భైరవుడు

# మళ్లెందుకు రావాలె?

### పాలమూరు బిడ్డను..మరువను ఈ గడ్డను!

### కేటీఆర్, కవిత, హరీశ్‌కు ఫామ్‌హౌస్‌లు ఎట్లొచ్చాయ్?

### లక్షల కోట్లు ఎక్కడివి ? ఏం వ్యాపారం చేశారు?

### ప్రజల నుంచి దోచుకున్న సొమ్ము కాదా?

### ఇక సంతోష్‌రావు ఆస్తులైతే చెప్పేటట్టే లేవు

### పశుపతిని ఫాంహౌస్‌లో బంధించాం..!

### ఎప్పటికీ బయటకు రాడు.. ఏదైనా ఉంటే గతమే

### మిడ్జిల్ కృతజ్ఞత సభలో సీఎం రేవంత్‌రెడ్డి

### మిడ్జిల్ అభివృద్ధి బాధ్యత తనదేనని స్పష్టీకరణ

మహబూబ్‌నగర్ జూలై 4: 'పాపాలభైరవుడు మళ్లీ రావాలంట. వస్తే ఏం చేస్తడు. పదేళ్లు అధికారంలో ఉండి ప్రజల సొమ్ము దోచుకోలేదా?. గజ్వేల్ ఫామ్‌హౌస్ ఎకరాల కొద్దీ ఎక్కడి నుంచి వచ్చింది, మీ తాత ముత్తాతలు ఇచ్చారా? నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల నుంచి దోచుకున్నది కాదా? మీ కొడుకుకు జన్వాడలో 100 ఎకరాలు, నీ అల్లుడు హరీశ్ రావుకు మొయినాబాద్‌లో 50 ఎకరాలు, నీ బిడ్డ కవితకు శంకర్‌పల్లిలో 25 ఎకరాల ఫామ్‌హౌస్‌లు ఏ విధంగా వచ్చాయి. నీ శడ్డకుని కొడుకు సంతోష్‌రావు ఆస్తుల లెక్కలు చెప్పేటట్టే లేవు. ఈ ఆస్తులన్నీ పదేళ్లలోనే ఎక్కడి నుంచి వచ్చాయి?. ఏడ సంపాదించారు, ఏం వ్యాపారం చేశారు' అని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అరుంధతి సినిమాలో

- మిగతా 2వ పేజీలో

## అంకెలపై రంకెలు

### మీ ప్రభుత్వంలో తెచ్చిన రూ.15 వేల కోట్లు కూడా మా ఖాతాలోకేనా..

### రాష్ట్రానికి ఉన్న అప్పు 4.17లక్షల కోట్లు మాత్రమే..

### స్కాంల నుంచి డైవర్షన్ చేయడానికే డ్రామాలు

### లంచాలు ఇచ్చి అప్పులు తేవడం సిగ్గుచేటు

### అసెంబ్లీ పెట్టండి.. చర్చిద్దాం: హరీశ్‌రావు



హైదరాబాద్, జూలై 4: అప్పుల విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అబద్దాలు, అర్ధసత్యాలు చెప్పి మసిబూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేశారని, రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శిం చారు. అన్నీ తెలిసి కూడా రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారని, లేని అప్పులను ఉన్నట్లుగా చూపి గోబెల్స్ ప్రచారానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఇటీవల హడావుడిగా ప్రెస్‌మీట్ పెట్టి అప్పుల విషయంలో అర్ధరహితంగా మాట్లాడారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికే రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న ఎఫ్ఆర్‌బీఎం, ఎస్‌పీవీ గ్యారంటీ రుణా లు మొత్తం కలిపి రూ.84,268 కోట్లు, 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి 31 వరకు అంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న ఎఫ్ఆర్‌బీఎం రుణాలు రూ.15,118 కోట్లు.. మొత్తం కలిపి రూ. 99,386 కోట్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వ అప్పుల్లో కలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 డిసెంబర్7 నాటికి ప్రభుత్వంపై ఉన్న మొత్తం బకాయి రుణాలు రూ.5,16,881 కోట్ల నుంచి తీసివేస్తే రాష్ట్రానికి ఉన్న అప్పు కేవలం రూ.4,17,495 కోట్లు

- మిగతా 2వ పేజీలో



## 12వేల మందికి అమరనాథుని దర్శనం

### యాత్రికులకు ప్రధాని మోదీ సూచనలు

శ్రీనగర్, జూలై 4: తొలిరోజు అమరనాథున్ని (మంచు శివలింగాన్ని) 12వేల మంది భక్తులు దర్శించుకున్నారు. 9,350 మంది పురుషులు, 2,250 మంది మహిళలు, 200మంది పిల్లలు ఉన్నారు. వీరంతా నువ్వాన్, బాల్టాల్ బేస్ క్యాంపుల నుంచి రెండు బృందాలుగా బయలుదేరారు. తొలిరోజు అమర్‌నాథ్ గుహలో శివలింగానికి జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూలై 3 నుంచి మొదలైన యాత్ర ఆగస్ట్ 28 వరకు కొనసాగుతుంది. అత్యంత

- మిగతా 2వ పేజీలో

## జనాన్ని తీసుకొస్తే చర్చలెలా సాధ్యం?

### అప్పుల లెక్కలడిగితే కేటీఆర్, హరీశ్‌కు ఆక్రోశం

### పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



అప్పులపై చర్చించడానికి భారాస నేతలు కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు మాజీ మంత్రులు ఎవరినైనా ఆహ్వానిస్తామని, జనాన్ని తీసుకొస్తే చర్చలు జరగవని అందుకే అరెస్ట్ చేశారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టంచేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మెజార్టీ సీట్లు సాధించి అధికారంలోకి వస్తుందన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, మున్నూరుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీరామ్‌లతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, భారాసలు ఒక్కటేనంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ... గతంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు, ట్రిపుల్ తలాక్ బిల్లు, రైతు వ్యతిరేక చట్టాల వంటి విషయంలో కేంద్రానికి భారాస సహకరించిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ...

"గతంలో డ్రగ్స్ విషయంలో టెస్టుల కోసం ఛాలెంజ్ చేస్తే కేటీఆర్ పారిపోలేదా? గత ప్రభుత్వం చేసిన అప్పులపై మాట్లాడితే కేటీఆర్, హరీశ్‌లు ఆక్రోశం

- మిగతా 2వ పేజీలో



## రెండేళ్లలో అందుబాటులోకి

# డబుల్ రోడ్లు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్: రెండేళ్లలో రాష్ట్రంలో నాణ్యమైన రెండు వరుసల(డబుల్) రహదారులు అందుబాటులోకి వస్తాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా సీఎం చేతుల మీదుగా హ్యామ్ రోడ్ల పనుల పైలాన్‌ను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 6న కరీంనగర్ జిల్లా హ్యామ్, సీఆర్‌ఎఫ్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తామని వివరించారు. హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాల నిర్మాణం 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. బాసర, భద్రాచలం ఆలయాల పునర్ నిర్మాణం, గోదావరి పుష్కరాల ఏర్పాట్లను గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. శుక్రవారమిక్కడ సచివాలయంలో ఆర్‌అండ్‌బీ పనుల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. "తొలిదశలో రూ.13 వేల కోట్లతో 6,092 కి.మీ. రోడ్ల పనులు చేపట్టనున్నాం. ఈ నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభమవుతాయి. ప్యాకేజీ-2లో రూ.155 కోట్ల అంచనా వ్యయంతో 42 కి.మీ. నల్గొండ-మహబూబ్‌నగర్ రోడ్డు పనులు ఇప్పటికే

- మిగతా 2వ పేజీలో



## ముంబైని ముంచిన వర్షం

### రెడ్ అలర్ట్ జారీ

### గడిచిన 24 గంటల్లో 100 మి.మీ

ముంబై, జూలై 4: నైరుతి రుతుపవనాల విస్తరణతో మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని, దేశ ఆర్థిక రాజధాని ముంబై నగరాన్ని వానలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. భారత వాతావరణ శాఖ ముంబై నగరానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. నగరంలో గంటకు 60 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. పశ్చిమ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉందని, కాబట్టి మత్స్యకారులెవరూ సముద్రంలోకి వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది. గడిచిన 24 గంటల్లో నగరంలో 100 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైందని తెలిపింది. బాంద్రాలో అత్యధికంగా 150.6 మి.మీ వర్షపాతం కురిసింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ముంపుప్రాంతాలైన విఖ్రోలి,

- మిగతా 2వ పేజీలో



### 20వేల కానిస్టేబుల్ ఉద్యోగాలను

## భర్తీ చేయండి

### ముఖ్యమంత్రికి కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 20 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి తక్షణమే ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన

- మిగతా 2వ పేజీలో



## లక్ష మంది అనర్హులకు పింఛన్!

- 65 వేల మంది మరణించినా వారి పేర్లపై పెన్షన్
- ఆచూకీ తెలియని 30 వేల మంది లబ్ధిదారులు
- రాష్ట్రం వెలుపల 5వేల మంది నివాసం
- లైవ్ అథెంటికేషన్ ప్రక్రియలో విస్తుపోయే నిజాలు
- బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న వాటిల్లో అక్రమాలు
- 17 లక్షల మంది వివరాల పరిశీలన

హైదరాబాద్: లోతైన పరిశీలన జరిపే కొద్దీ అనర్హులకు చేయూత పింఛన్లు అందుతున్న వైనం విస్మయం కలిగిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వపరంగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్న లైవ్ అథెంటికేషన్ ప్రక్రియలో పెద్దసంఖ్యలో అనర్హుల జాబితా బయటకు వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 42 లక్షల మంది చేయూత పెన్షన్ దారులుండగా (దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇలా వివిధ కేటగిరీల వారు),

- మిగతా 2వ పేజీలో

## జనాన్ని తీసుకొస్తే చర్చలెలా సాధ్యం?

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లగక్కుతున్నారు. ఇబ్బడిముబ్బడిగా చేసిన అప్పుల కాగితాలన్నీ అధికారుల వద్ద భద్రంగా ఉన్నాయి. అప్పటి ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతినెలా మేం వడ్డీ చెల్లిస్తున్నాం. మరోవైపు 30 మాసాల్లోనే కాంగ్రెస్ రూ.6 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు తీసుకొచ్చింది. త్వరలో జీహెచ్ఎంసీతోపాటు మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరగొచ్చు" అని వివరించారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను మహేశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా... "యాదగిరిగుట్ట దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పంతోనే అత్యున్నత స్థాయి కమిటీ వేశారు. దీనిపై ఆ జిల్లా నాయకులను ముందే సంప్రదిస్తే బాగుండేది" అని మహేశ్‌కుమార్ అన్నారు.

## ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

(మొదటి పేజీ తరువాయి)

వేళ సుమారు 40 దేశాల నుంచి భారత్ ఇంధనం సేకరించిందని గుర్తుచేశారు. ప్రధాని శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లాలో పర్యటించారు. ప్రతిష్ఠాత్మక హెచ్‌పీసీఎల్ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టును ప్రారంభించారు. అనంతరం అదేచోట నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. నాడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు రూ.75,000 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, అయినప్పటికీ.. ఆ నష్టాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించిందని వెల్లడించారు. అలాగే, ఎల్పీజీ అవసరాల కోసం భారత్ సుమారు 60 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్నదని, మొన్నటి పశ్చిమాసియా యుద్ధ సమయంలో ఎల్పీజీ దిగుమతులు కష్టతరమయ్యాయని, అయినప్పటికీ దేశంలో ఎల్పీజీ సంక్షోభం రాకుండా చూశామని తెలిపారు. అప్పటి సంక్షోభంలో ఒక్కో గ్యాస్ సిలిండర్ ధర రూ.2వేలకు మించేదని, కానీ.. తాము తీసుకున్న నిర్ణయాలతో రూ.950 దాటకుండా చూశామని వివరించారు. తాజాగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు కూడా తగ్గించామని గుర్తుచేశారు. భారత్ ఇంధన స్వయం సమృద్ధి సంకల్పంలో రిఫైనరీ ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం దియా కుమారి తదితరులు పాల్గొన్నారు.

### జోధ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌కు నయా అందాజ్

ఆయిల్ రిఫైనరీ ప్రారంభోత్సవం తర్వాత ప్రధాని మోదీ జోధ్‌పూర్‌కు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. సుమారు 23,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ టెర్మినల్, ప్రయాణికుల రద్దీని సమర్థంగా నిర్వహించనుంది. విస్తరణ కోసం పౌర విమానయానశాఖ ప్రత్యేకంగా ఆర్కిటెక్ట్‌లను రిక్రూట్ చేసుకున్నది. వారు కొన్ని నెలల పాటు శ్రమించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, వేగవంతమైన చెక్-ఇన్ వ్యవస్థలు, అత్యాధునిక వెయిటింగ్ హాల్స్, ఇతర నిర్మాణాలు పూర్తిచేశారు.

## 20వేల కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయండి

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం బహిరంగలేఖ రాశారు. "రాష్ట్రంలో సుమారు 17 వేల పోలీసు పోస్టులు ఖాళీ ఉన్నాయని ఆర్టీఐ ద్వారా బహిర్గతమైంది. స్వయంగా మీరే 12 వేల పోస్టులు ఖాళీ ఉన్నాయని, వాటిని భర్తీ చేస్తామని పలుమార్లు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కేవలం 5 వేల పోస్టులు భర్తీ చేస్తామనడం.. సుమారు 15 లక్షల మంది పోలీస్ ఉద్యోగార్థులను నైరాశ్యంలోకి నెట్టేసింది. భారాస హయాంలో సుమారు 47 వేల పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేశాం. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని యువతను నమ్మించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా.. కేవలం 17 వేల కొత్త ఉద్యోగాలను మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసింది. నిరుద్యోగ అభ్యర్థుల డిమాండ్ మేరకు కనీసం 20 వేల పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి. లేని పక్షంలో భారాస తరఫున నిరుద్యోగులకు మద్దతుగా పోరాటానికి పిలుపునిస్తాం" అని కేటీఆర్.. ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## 12వేల మందికి అమరనాథుని దర్శనం

(మొదటి పేజీ తరువాయి)

కఠినతరమైన ఈ యాత్రను సులభతరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపట్టాయి. దారి, కొండమార్గాల విస్తరణ చేపట్టాయి. 3,978 మీటర్ల ఎత్తు వరకు దారిలో ఐదు బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. యాత్రలోని భక్తులు ఈ క్యాంపుల్లో విశ్రాంతి తీసుకునేందుకు, వైద్య సదుపాయం తదితరాలను కల్పించారు. ఈ యాత్రకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తూ, పలు కఠిన నియమ నిబంధనలను అమలు చేశారు. భక్తులకు మౌలిక సదుపాయాలు తదితరాలపై కశ్మీర్ డివిజనల్ కమిషనర్ అన్షుల్ గార్గ్ ప్రత్యేక చర్యలు తీసుకొని పర్యవేక్షిస్తున్నారు. యాత్ర పూర్తయ్యేంతవరకు ఈ ప్రాంతాన్ని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. కాగా అమర్‌నాథ్ యాత్రలోని భక్తులకు ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఐదు ప్రతిజ్ఞతలు చేయాలని సూచించారు. పరిశుభ్రతను పాటించడం, స్థానిక ఉత్పత్తులను కొనడం, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పచ్చదనాన్ని ప్రోత్సహించడం, రక్షాబంధన్ రోజు బంధువులకు బహుమతికి మొక్కలను అందజేయాలని, దేశమే ప్రథమం అనే నినాదాలతో యాత్రను కొనసాగించాలని ప్రధాని పిలుపునిచ్చారు.

## రెండేళ్లలో అందుబాటులోకి డబుల్ రోడ్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమయ్యాయి. వర్షాకాలం పూర్తయిన తర్వాత మూడు షిఫ్టుల్లో రోడ్ల పనులు చేపట్టాలి. టిమ్స్ ఆసుపత్రులతోపాటు నిమ్స్ విస్తరణ, వరంగల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి పనులు త్వరగా పూర్తిచేయాలి. నిర్మాణ ప్రాంతాల్లో ఈ వారం నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తా. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు వెల్లడైతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు" అని పేర్కొన్నారు.

## ముంబైని ముంచిన వర్షం

(మొదటి పేజీ తరువాయి)

ఘాట్కోపర్, దాదర్ జలమయమయ్యాయి. సబర్బన్ లోకల్ రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రైళ్లు ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అరేబియా సముద్ర తీరంలో 4.26 మీటర్ల ఎత్తున అలలు ఎగసిపడ్డాయి. వర్షాల నేపథ్యంలో బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంఎంసీ) అప్రమత్తమైంది. పాఠశాలలు, కళాశాలకు మధ్యాహ్నం సెషన్ నుంచి సెలవు ప్రకటించింది. వర్షాల ధాటికి రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు గల్లంతై మరణించారు. ముంబైలో చెట్టు కూలి బస్సుపై పడటంతోనే విద్యార్థి మరణించాడు. మరో ఇద్దరు వరదలో గల్లంతై మృతిచెందారు. పుణెలో వర్షపు నీటితో నిండిన గుంతలో పడి రెండేళ్ల చిన్నారి చనిపోయాడు. థానేలో విద్యుత్ వైర్లు తగిలి, విద్యుత్‌షాక్‌తో ఓ మహిళ అక్కడికక్కడే మరణించింది. నవీ ముంబైలో వరద నీటిలో నడుస్తూ విద్యుత్ షాక్‌కు గురైన ఇద్దరు విద్యార్థులు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మహారాష్ట్రతోపాటు మధ్యప్రదేశ్, గుజరాత్‌లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉప్పొంగిన వాగులు, నదుల కారణంగా ఆయా రాష్ట్రాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి.

# పాపాల భైరవుడు మళ్లెందుకు రావాలె?

(మొదటి పేజీ తరువాయి)

పశుపతిని ఎలాగైతే బందీఖానా చేశారో తెలంగాణ ప్రజలు పాపాయిల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో గొలుసులతో కట్టేశా రని, అక్కడే ఉండాలన్నారు. మరోసారి అధికారంలోకి రావడం అనేది కలలో మాట, ఇది ఎప్పటికీ జరగదన్నారు. ఏదైనా మీకు ఉందంటే అది గతమేనని, భవిష్యత్తు లేదన్నారు. మీ భవిష్యత్తుకు ప్రజలు శాశ్వతంగా ముగింపు పలికారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో కృతజ్ఞతాభివందన సభ ఏర్పాటు చేశారు. అంతకుముందు ఆత్మీయులను సీఎం రేవంత్‌రెడ్డి పలకరించారు. తన రాజకీయ ప్రస్థానంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన మిత్రులు, పెద్దలను.. రాజకీయాల్లో తనతో పాటు పనిచేసి న వారిని పేరుపేరునా పలకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట ఆంజనే యస్వామి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా మిడ్జిల్ సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఇండ్లు ఇవ్వలే, నీళ్లు ఇవ్వలే, నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు ఇవ్వలేదని, ఎందు కు మరి మీరు రావాలి అని ప్రజలు అంటున్నారని ప్రశ్నించారు. అల్లుడు, కొడుకును మంత్రులు చేశారని, బిడ్డను ఎంపీ చేశారని, మందులు అందించే శడ్డకుని కొడుకుని రాజ్యసభ సభ్యుడిగా చేశారని, వారి చుట్టాలను వినోద్‌రావుతో పాటు పలువురిని వివిధ హోదాలు ఇస్తూ అవకాశం కల్పించారన్నారు. ఓడిపోతే ప్రభుత్వ సలహాదారులుగా చేశారని, ఎందుకే వారు గుండె లు బాదుకుని రావాలి మా పాపాల భైరవుడు అంటున్నారని పేర్కొన్నారు. చూపిం చుకోవడానికి టీవీ రాసుకోవడానికి పేపర్ చప్పట్లు కొట్టడానికి భజనపరులను ఇచ్చారని అందుకోసం వారు రావాలంటున్నారని విమర్శించారు. ప్రజా పాలనపై దావత్, పెళ్లికి పోయిన, బీర్ షాప్‌కు బార్ షాప్‌కు ఎక్కడికి పోయినా ఎక్కడికిపోయినా ఈ ప్రజాపాలన ఎందుకు పోవాలి? ఆ పాపాల భైరవుడు ఎందుకు రావాలని చర్చ పెట్టాలని సూచించారు. రేషన్‌కార్డు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు, ఉచిత కరెంటు, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయా ణం, రైతుభరోసాతో పాటు పలు పథకాలు ఇస్తున్నందుకు ఈ ప్రజాపాలన పోవాల్నా అని ప్రశ్నించారు. వరి వేస్తే ఉరి వేసుకున్నట్టే అని ఆనాడు వారు పేర్కొన్నారని, రెండు కోట్ల 88 లక్షల మెట్రిక్ ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేశామన్నారు. డ్రగ్స్, గంజాయి అమ్మేవారిని బొక్కలో వేశామని, మీరు వస్తే ఫామ్ హౌస్ లలో మాదక ద్రావ్యలను మార్కెట్లో అమ్మేస్తారని విమర్శించారు. వారితోపాటు కోట్ల రూపాయలు సంపాదించిన అధికారులు సైతం 100 200 కోట్ల రూపాయలతో ఏసీబీ వారికి ప ట్టుపడుతున్నారని విమర్శించారు. గ్రూప్ పరీక్ష పత్రం అమ్ముకొని లక్షలాది మందికి అన్యాయం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలైందని నిరుద్యోగ యువకులు ఉద్యోగాలు లేవని, రైతులు ఆత్మహత్యలు చేసుకు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరలు ఇచ్చిన అందులో కమీషన్ తీసుకున్నారని, ఆ చీరలు తీసుకొని పొలాల దగ్గర కంచెలు కట్టారని విమర్శించారు. ప్రతి నెల 5600 కోట్లు ఖర్చు పెడుతున్నామని, పదేళ్లలో మీరు ఖర్చు పెట్టింది ఎంతో చెప్పాల న్నారు. పదేండ్లలో రూ 8లక్షల21 వేల కోట్ల ను అప్పులు ఎట్లా అయ్యాయని, లక్ష కోట్లు కేసిఆర్ ఎలా సంపాదించారని, రాష్ట్రం ఎం దుకు అప్పుల పాలైందని ప్రజలు ప్రశ్నించాలన్నారు. కేసీఆర్ మరోసారి వస్తే భార్యాభ ర్తలు మాట్లాడుకుంటే కూడా వారు వింటారని ఇప్పుడే ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి చెప్పారని వారు ఇంతకు మనుషులా పశువులా అని విమర్శించారు. రాజకీయ నాయకులు, అధికారుల మాటలు వింటే ఏదైనా అవసరం ఉంటుందో అనుకోవచ్చని ఆడబిడ్డల మాటలు ఎందుకు వింటారని వారు ఇం తకు మనుషులేనా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ చీర అందిస్తే ఎంతో ఆనందంగా కట్టుకొని తమను ఆశీర్వదించేందుకు వచ్చారని చెప్పారు. ప్రజలు ఎమ్మెల్యేగా ఉద్యోగం ఇచ్చారని అసెంబ్లీకి మాత్రం రారంట అని, కేవలం అధికారంలోకి వస్తేనే మాట్లాడుతారంట ఇదెక్కడి పద్ధతి అన్నారు. ఒక్కరోజు సెలవు తీసుకోలే.. ఏది చేసిన ప్రజల మంచి కోసమే చేశారని ప్రతిపక్షంలో ఉంటే ప్రజా గొంతుకగా ఉండి ఒక్కరోజు కూడా సెలవు లేకుండా గత 20 ఏళ్ల నుంచి పని చేస్తున్నాని సీఎం రేవం త్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు దీర్ఘకాలికంగా సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్య లను పరిష్కరించేందుకు అడుగులు వేస్తున్నానన్నారు. ఎమ్మార్పీఎస్ నేతలు తమతో కలిసి పనిచేశారని వర్గీకరణకు తమకు అవకాశం వచ్చిన వెంబడే చేయడం జరిగింద న్నారు. మన దేశంలో కోడి పిల్లలకు లెక్క ఉందని,1931లో బ్రిటిష్ రాజ్యంలో బడుగు బలహీన వర్గాలను లెక్కపెట్టారని అప్పటి నుంచి ఇప్పటివరకు జనాభా లెక్కలు చేయలేదని జనగణలో కులగన చేసి ఎవరు ఎంత ఉన్నారో వారికి అవసరమైన కేటాయింపు లు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదన్నారు. పాలమూరు బిడ్డలు పరిపాలనకు పనికి రారని ఎందుకు అనుకుంటున్నారని తట్ట పనికి, పార పనికి పాలమూరు బిడ్డలే అవసరమైనప్పుడు పరిపాలనకు ఎం దుకు పనికిరారని ప్రశ్నించారు. అహంకారానికి, అహంభావనికి హద్దు ఉంటుందని, గద్దర్ అన్నను గడిల ముందు ఎర్రటి ఎం డకు గంటల తరబడి నిలబెట్టారని ఇది క్షమించరాని తప్పన్నారు. గద్దర్ అన్నను అవమానించిన మీకు ఉరిశిక్ష వేసిన తక్కువేనని ప్రజలను అడుగుతున్నానన్నారు. రా ష్ట్రంలో ఈ ప్రభుత్వము అడిగిన ప్రతి బిడ్డకు రేషన్ కార్డు అందించడం జరిగిందని రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం ఇచ్చిం ది వాస్తవం కాదా అన్నారు. 4.50 ఇండ్ల ను ఇవ్వడం జరిగిందని మరో సారి ప్రతి నియోజకవర్గానికి ఇండ్లు కేటాయించడం జరిగిం దన్నారు. ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతోపాటు రూ 21 వేల కోట్ల తో రైతు రుణమాఫీ,200 యూనిట్ల లోపు ఉచి త విద్యుత్ అందిస్తున్నామని,రూ 36 వేల కోట్ల ను రైతు భరోసా అందిస్తున్నామన్నారు. రూ 80 వేల కోట్లను వడ్లు కొనేందుకు ఖర్చు చేశామన్నారు. ఉచిత విద్యుత్ కోసం మరో 30 వేల కోట్లను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖర్చు చేయడం జరిగిందన్నారు. రూ 1 లక్ష 76వేల కోట్ల ను ఈ 30 నెలల కాల వ్యవధిలో ఖర్చు చేయడం జరిగిందన్నారు. పదేళ్లలో నేరెడ్ల గడ్డలు ఇసుక లారీలకు అడ్డంపడితే లారీలతో తొక్కించారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర అడిగితే ఖమ్మం జిల్లాలో గిరిజనులకు బేడీ లేసి జైలుకు పంపించారని విమర్శించారు.

### కలలను సాకారం చేసుకున్నప్పుడే..: జూపల్లి

మనిషి పుట్టడం గిట్టడం సహజమని, ఇది ప్రతి వ్యక్తి జీవితంలో జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పుట్టిన ప్రతి ఒక్కరూ తమ కలలను నిజం చేసుకున్నప్పుడే ఆ జీవితానికి అర్థం ఉంటుందని, అందుకు నిలువెత్తు నిదర్శనం సీఎం రేవంత్‌రెడ్డి అని పేర్కొన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా 20 ఏళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చి తిరుగులేని నాయకుడిగా ఎదిగి రాష్ట్రాన్ని ఉన్నత స్థాయిలో తీసుకుపోతున్నాడు. పాలమూరు జిల్లా బిడ్డ ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి దిశ గా ముందుకు సాగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు తమ తమ వృత్తుల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలి.

### సీఎం రేవంత్‌తోనే జడ్జర్ల అభివృద్ధి: అనిరుద్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి వల్లే జడ్చర్ల నియోజకవర్గం అభివృద్ధి చెందినదని ఎమ్మెల్యే అనిరు ధ్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు రూ 631 కోట్లు, ఊరుకొండ పేటకు రూ.10 కోట్లు, ఊరుకొండ ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయానికి రూ 12 కోట్ల 80 లక్షల ను, జక్‌బోయిన్పల్లి టు వెల్జాల వరకు రూ.కోటి 20 లక్షలతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. మిడ్జిల్లో మహిళలకు సమైక్య భవన నిర్మాణం కోసం రూ.65 లక్షలు.. వీటితో పాటు అనేక అభివృద్ధి పనులకు నిధులు ఇచ్చారని పేర్కొన్నారు. నియోజకవర్గానికి వచ్చినప్పుడల్లా నిధులు తీసుకువస్తారని తెలిపారు.

### సాధారణమైన విషయం కాదు: భట్టి విక్రమార్క

జెడ్పీటీసీగా ప్రస్థానం మొదలుపెట్టి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. ప్రజా సంక్షేమమే ఎజెండాగా తమ పరిపాలన కొనసాగుతుందన్నారు. పాలనంటే అధికారం కాదని, ప్రజల కోసం పాటుపడడమని, రాష్ట్రంలో కోటి 15 లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని, 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, భోజనం అందిస్తున్నామని, నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించామని చెప్పారు. వడ్డీ లేని రుణా లో భాగంగా ప్రతి సంవత్సరం స్వయం సహాయక మహిళా సంఘాలకు 20 వేల కోట్లు ఇస్తున్నామని, ప్రజల అవసరాలు తీర్చడమే పరిపాలన అని పేర్కొన్నారు.

## మిడ్జిల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

మిడ్జిల్ మండలానికి తమ ప్రాణం ఇచ్చినా తక్కువే అవుతుందని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రూ.47.08 కోట్లతో మిడ్జిల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.10 కోట్లతో ఊరుకొండపేట శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.20 కోట్లతో పాత మిడ్జిల్ మండలంలోని 40 గ్రామ పంచాయతీల అభివృద్ధికి, రూ.17,08, 45000 వ్యయంతో మిడ్జిల్ మండలంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సభా ప్రాంగణానికి వస్తున్న సమయంలో ప్రజలకు కరాచాలనం చేస్తూ వేదిక దగ్గరికి చేరుకున్నారు. జయ జయహే తెలంగాణ పాట సభ ప్రాంగణం గొంతు కలి పారు. మిడ్జిల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధ్యాపా గోపాల్ రెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఉరుములు, మెరుపులు ఉన్నా ఇక్కడ కు రావడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. హైదరాబాద్ రాష్ట్రం మొదటి ముఖ్యమంత్రిగా పాలమూరు జిల్లా వాసి బూర్గుల రామకృష్ణారావు తో మన జిల్లాకే మొదటి అవకాశం వచ్చిందన్నారు. ఉత్తమ పార్లమెంటరీన్ అతి చిన్న వయసులోనే దివంగత నేత జైపాల్ రెడ్డికి ఎంతో గౌరవం దక్కిందన్నారు. రాష్ట్ర, కేంద్రం లో ఆయనకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉండి దివంగత ధ్యాపా గోపాల్ రెడ్డి అండగా నిలిచారన్నారు. మిడ్జిల్ మండలం ప్రజలు ఆనాడు తీసుకున్న మీ నిర్ణయమే ఈనాడు మీ ముందు సీఎంగా నిలబడేలా చేసింది అన్నారు. ఆనాడు రబ్బాని గెలిచి ఉంటే జెడ్పి చైర్ పర్సన్ గా ఉండేవారని ఉపముఖ్యమంత్రి అంటున్నారని, ఈనాడు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, ఎంపీ మల్లు రవి లు కలిసి ఒక మంచి పదవి రబ్బాని ఇవ్వాలని సూచించారు. ఆనాడు నాతో పని చేసిన సర్పంచులు ఎంపిటిసి లతోపాటు ప్రజలు ఎన్నో కష్టాలను చూసామని వాగులు దా టేందుకు ప్రయత్నాలు చేసినప్పుడు ఎంతోమంది కొట్టుకుపోయారని గుర్తు చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మిడ్జిల్ మండలంతో పాటు గట్టు మండలాన్ని డార్క్ మండలాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ మండలాన్ని దత్తత తీసుకోవాలని కోరారు.

### మీ ఆశీర్వాదంతో సమర్థవంతంగా..: సీఎం

మీ ఆశీర్వాదంతో సమర్థవంతంగా తమ బాధ్యతను నిర్వర్తిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెస్సితో ఫుట్బాల్ ఆడిన దేశంలో ఎక్కడ తిరిగిన మీరు నాటిన మొక్కనే ఈరోజు పెద్దదై ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. ఈ బాధ్యతను కొనసాగించేందుకు నిండు మనసుతో ఆశీర్వదించాలని ఇంకా నేను చేయవలసిన పనులు ఉన్నా యని చెప్పారు. వలసల జిల్లాను అభివృద్ధి వైపు నడిపించాల్సిన బాధ్యత తమపై ఉందని, చేయాల్సిన పనులు మిగిలే ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రతి పేదవాడికి విద్యతో పాటు ఉద్యోగం అవసరమైన సదుపాయాలు, సాగునీరు అందేలా చూస్తామన్నారు. 2034 వర కు కాంగ్రెస్ అధికారంలో పక్కాగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఆనాడు నేను జెడ్పిటిసి అవుతా అంటే మీరు చేశారని, ఎమ్మెల్సీ కావాలంటే చేశారని, కోడంగల్ కు వెళితే రెండు సార్లు ఎమ్మెల్యేగా చేశారని అక్కడ కష్టం వస్తే మల్కాజ్ గిరి పార్లమెంట్ లో ఎంపీగా చేశారని, ఇప్పుడు ముఖ్యమంత్రిగా చేసి మీ ముందు నిలబడేలా ఆశీర్వదించారని చెప్పారు. మళ్లీ కాంగ్రెస్ రావాలని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని పేర్కొన్నారు.

# అంకెలపై రంకెలు

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమేనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కార్పొరేషన్ రుణాలు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం ఉండదన్నారు. అప్పుల విషయంలో మంత్రి జూపల్లి సవాల్ చేసి తోక ముడిచిన తీరును యావత్ తెలంగాణ సమాజం చూసిందని, ఆ అవమానం నుంచి ఎలాగైనా బయటపడాలనే భావనతో, ఆత్మరక్షణలో భాగంగా అప్పులపై 'భట్టి' తప్పుడు లెక్కలు వండి వార్చారని మండిపడ్డారు. మేం అప్పుల విషయంలో స్పష్టంగా ఉన్నామని, మీ లాగా పూటకో మాట, ఇష్టం ఉన్నట్లు లెక్కలు చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలోనైనా, బహిరంగ సమావేశాల్లోనైనా, ప్రెస్‌మీట్‌లోనైనా మాది ఒకటే మాట అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఆదాయవనరులు సమకూర్చుకోవడంలో అపారమైన అనుభవం ఉన్న కాంగ్రెస్ పార్టీకి అది పెద్ద సమస్య కాదన్న భట్టి.. హామీలు ఎందుకు అమలు చేయడం లేదు.. మీ అపారమైన అనుభవం ఏమైందని ప్రశ్నించారు. కరోనా వచ్చినా, ఎకానమీ డౌన్ అయినా.. కేసీఆర్ ఏనాడూ రాష్ట్రాన్ని దివాళా తీయించలేదని గుర్తు చేశారు. మరి ఇప్పుడు కరోనా, పెద్ద నోట్ల రద్దు లేకున్నా.. మీ సీఎం ఎందుకు దివాళా దివాళా అని మాట్లాడుతున్నరు?, నన్నెవరూ నమ్ముతలేరు, అప్పు పుడతలేదు.. అపాయింట్‌మెంట్ దొరకట్లేదు. దొంగను చూసినట్టు చూస్తున్నారు.. అని ఎందుకు దిగజారి మాట్లాడుతున్నారని అని ప్రశ్నించారు. మీ అపారమైన అనుభవం కమీషన్లు దండుకోవడానికి తప్ప రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడలేదన్నారు. ఫైనాన్స్ మినిస్టర్ అయ్యి ఉండి కూడా చూసుకోకుండా ఎవరో తయారు చేసిన నోట్ చదివి, ఆ విధంగా అబద్ధాలు మాట్లాడొచ్చు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను హరీశ్‌రావు ప్రశ్నించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు 8,21,651 కోట్లు అని అదే కట్టు కథ చెప్పారని మండిపడ్డారు. ఎన్ని కలిపినా వాళ్లు చెప్పిన రూ.8,21,651 కోట్లు నిండటం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పుల గురించి కాగ్ రిపోర్టు కుండబద్దలు కొట్టినట్లు చెప్పిందన్నారు. 2024 మార్చి నాటికి ప్రభుత్వమే చెల్లించే ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ రూ.1,20,944 కోట్లు కాగా, ఇందులో భట్టి చెప్పిన డాక్యుమెంట్‌లో 2014 జూన్ 2 నాటికి ప్రభుత్వం చెల్లించే ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ రూ.11,609 కోట్లు తీస్తే రూ.1,09,335 కోట్లు ఉంటుందని వివరించారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం, సీతారామ, స్కీములకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు అక్షరాల రూ.4,10,819 కోట్లు అని కాగ్ స్పష్టం చేసిందని వెల్లడించారు. అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంతో సంబంధం లేనివి కలిపి అప్పు రూ.6,71,757 కోట్లు అని చెప్పారని పేర్కొన్నారు. మీరు ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరలించడం కోసం, మీ స్కామ్‌ల నుంచి డైవర్షన్ చేసేందుకు అప్పుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్క రూ. లక్ష 77 వేల కోట్ల అప్పు తెచ్చినం అంటారు.. 2026 మార్చి 18న అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఎఫ్ఆర్‌బీఎంతో పాటు, అన్ని రకాల అప్పులు, 2026 ఫిబ్రవరి 28 నాటికి అన్ని కలిపి రూ.3,47,294 కోట్లు అని స్వయంగా ప్రకటించారని.. నాలుగు నెల్లలో అప్పు ఎట్ల తగ్గిందని ప్రశ్నించారు. జూన్ 30 నాటికి పబ్లిక్ డొమైన్ ఉన్న లెక్కల ప్రకారం, 31 నెలల్లో రేవంత్ రెడ్డి చేసిన మొత్తం అప్పు 4.50 లక్షల కోట్లు అని తెలిపారు. ప్రభుత్వమే అప్పుల కోసం బ్రోకర్లకు లంచాలు ఇచ్చే పరిస్థితికి దిగజారిందని, అందుకే రేవంత్‌రెడ్డిని ప్రజలు దొంగలా చూస్తున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. టీజీఐఐసీ భూములను కుదువపెట్టి రూ.10వేల కోట్ల అప్పు తేవడానికి బ్రోకరేజ్ చార్జీ రూ.170 కోట్లు చెల్లించారని, మొత్తం రూ.30 వేల కోట్లకు గాను అక్షరాల రూ. 510 కోట్లు ఇచ్చారని ఆరోపించారు.

## లక్ష మంది అనర్హులకు పింఛన్!

(మొదటి పేజీ తరువాయి)

వారిలో దాదాపు 19 లక్షల మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రతి నెలా కోర్ బ్యాంకింగ్ విధానంలో (సీబీఎస్) పెన్షన్ జమ అవుతోంది. అయితే దీనికి సంబంధించి గతంలో దారిద్ర్య నిర్మూలనాసంస్థ (సెర్ప్) నిర్వహించిన పైలట్ పరిశీలనలో పెద్దఎత్తున అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా లైవ్ అథెంటిఫికేషన్ ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం వరకు సుమారు 17 లక్షల మంది లబ్ధిదారుల ధ్రువీకరణ పూర్తికాగా, మరో 2 లక్షల మంది ధ్రువీకరణ మిగిలి ఉంది. ఈ లబ్ధిదారుల లైవ్ అథెంటిఫికేషన్‌ను కూడా ప్రభుత్వం వేగంగా పూర్తి చేసే దిశలో చర్యలు చేపడుతోంది. ఇప్పటికే గుర్తించిన అనర్హుల స్థానంలో అర్హులైన పేదలకు పెన్షన్లు మంజూరు చేయడం ద్వారా కొత్తగా 2 లక్షల మందికి నూతనంగా అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు పూర్తయిన ధ్రువీకరణలో దాదాపు లక్ష మంది దాకా అనర్హులకు పింఛన్లు అందుతున్నట్లుగా గుర్తించారు. దీంతో ప్రభుత్వం నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతను మరింతగా అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటివరకు నిర్వహించిన ధ్రువీకరణలో ఆందోళనకర విషయాలు వెలుగుచూశాయి. దాదాపు లక్ష మంది దాకా అనర్హులుగా గుర్తించారు. వారిలో దాదాపు 65 వేల మంది మరణించినప్పటికీ వారి పేర్లపై పింఛన్లు కొనసాగుతున్నట్లు తేలింది. అదేవిధంగా 30 వేల మంది లబ్ధిదారుల ఆచూకీ లభించలేదు. నమోదైన మొబైల్ నంబర్లకు పలుమార్లు సంప్రదించినప్పటికీ స్పందన రాకపోవడంతో వారు వాస్తవంగా ఉన్నారా? లేక వారి పేర్లపై ఎవరైనా అక్రమంగా పెన్షన్లు పొందుతున్నారా? అనే అంశంపై మరింత విచారణ కొనసాగుతోంది.

# దొడ్డి కొమురయ్య నేటి యువతకు స్ఫూర్తి...

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 4**


దొడ్డి కొమురయ్య కురుమ గారి వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ . తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ 80వ వర్ధంతి సందర్భంగా జగిత్యాల పట్టణ ధర్మపురి రోడ్డు లో విజయపురి లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తి దాయకమని, ఆయన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి సి సి అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, గడ్డం నారాయణ రెడ్డి, కౌన్సిలర్ లు చెట్టే గంగాధర్ , దయాళ చంద్రకళ శంకర్, కోరే జయ గంగమల్లు,పిట్ట ధర్మరాజు,చీటి లక్ష్మీ నారాయణ,కూతురు శేఖర్,మమత రామకృష్ణారెడ్డి, దుమల రాజ్ కుమార్, జుంబర్తిరాజ్ కుమార్,మాజీ కౌన్సిలర్ కుసరి అనిల్ కుమార్, జిల్లా



యూత్ ఉప అధ్యక్షులు సాయి, పట్టణ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ,కురుమ సంఘం అధ్యక్షుడు పుల్ల మల్లయ్య, దయాళ మల్లారెడ్డి కురుమ సంఘం సభ్యులు ,పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గార్ల బయ్యారం మండలాల ప్రజలను అయోమయానికి గురి చేస్తున్న ఐటీడీఏ అధికారులు.

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) జులై 4**




గార్ల ఆదివాసి సంక్షేమ పరిషత్ తెలంగాణ రాష్ట్ర శాఖ వారు శుక్రవారం హైదరాబాద్ సెక్రటేరియట్ లో స్పెషల్ సెక్రటరీ తెలంగాణగిరిజన సంక్షేమ శాఖ వారినిని. కలిసి మెమోరాండం ఇవ్వడమైనది. అనంతరం పూనెం శ్రీనివాస్ రాష్ట్ర అధ్యక్షులు ఆదివాసి సంక్షేమ పరిషత్ తెలంగాణ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా సమయంలో ఐటీడీఏ భద్రాచలం పరిధిలో ఉన్నటువంటి గార్ల బయ్యారం మండలాలను జిల్లాల విభజన సమయంలో మహబూబాబాద్ జిల్లా పరిధిలో కలపడం జరిగినది. అప్పటినుండి ఐటీడీఏ(ౠణూ) భద్రాచలం వారు గార్ల బయ్యారం మండలాల పరిధిలోని ప్రజలకు ఐటీడీఏ భద్రాచలం అధికారులు ఈ మండల ప్రజల సమస్యలు పరిష్కరించకుండా ౠణూ ఏటూరునాగారం అంటూ ఇక్కడ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని అలాగే ఐటీడీఏ భద్రాచలం పరిధిలోని నిరుద్యోగ యువకులకు ఇచ్చే శిక్షణ తరగతులు కూడా ఈ రెండు మండలాల నిరుద్యోగులకు అవకాశం ఇవ్వకుండ ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా స్కూల్ అడ్మిషన్స్ మరియు గురుకుల కాలేజ్ అడ్మిషన్స్ కూడా గార్ల బయ్యారం మండలాల విద్యార్థులకు కల్పించకుండా ఐటీడీఏ భద్రాచలం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారికి తెలపడం అయినది. జిల్లాల విభజన జరిగి ఉండవచ్చు గానీ ఐ.టీ.డీ.ఏ లను ఏజెన్సీ పాత్ర ఆద్దుల నుండి మార్చడానికి గవర్నర్ గారి అనుమతులు మరియు రాష్ట్రపతి ఆమోదం కావాల్సి ఉంది. కానీ దీనికి భిన్నంగా ఐటీడీఏ అధికారులే ప్రాంత ఆద్దులను గీసుకొని ఇక్కడి ఆదివాసి ప్రజలను చదువులకు ఉద్యోగ తరగతీ శిక్షణకు ఉద్యోగ ఉపాధి నియామకాలకు నిరుద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ సంద ర్భంగా వారికి తెలియజేయడం జరిగినది. ట్రైబ్స్ ఏ ×ు.ఐ.ూా కి వెళ్ళాలో తెలియక గార్ల బయ్యారం మండల గిరిజన ప్రజలు పోడు భూముల సమస్యలు రెవెన్యూ సమస్యలు ఎవరికి చెప్పుకోవలో తెలియని అయోమయంలో ఉన్నారు . ూు= కేసుల సమస్యల పరిష్కరించడంలో ×ు.ఐ.ూా పరిధిలోకి గార్ల బయ్యారం మండలాలు ఉన్నాయలేవ అని తెలియకపోవడంతో ఏ అధికారులు కూడా ఇక్కడ సమస్యలు పరిష్కరించటానికి ముందుకు రాకపోవడం దురదృష్టకరం ఫారెస్ట్ భూములలో విద్యుత్ అనుమతులు కూడా ఐటీడీఏల నుండి రావాల్సి ఉంది. కానీ అలాంటి పనులు ఏమి జరగటం లేదని తక్షణమే గార్ల బయ్యారం మండలాలను ఐ.టి.డి.ఏ భద్రాచలం పరిధిలోనే అన్ని విభాగాలు పనిచేసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరడమైనది. ఈ యొక్క కార్యక్రమం లో శ్రవణ్ .దానసరి రాజేష్ . వర్స ప్రకాష్.సుధాక పాల్గొన్నారు....



## తెలంగాణ సాయుధ పోరాట వీరుడు “దొడ్డి కొమురయ్య

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) జులై 4**

నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య వర్ధంతి ఉత్సవాలకు వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువతకు మార్గదర్శకమని తెలిపారు. దేశ స్వాతంత్రం, ప్రజల సంక్షేమం కోసం విరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ‘అంబేద్కర్ యూనివర్సిటీ’ దూరవిద్య ప్రవేశాలు

**జమ్మికుంట, జులై 04 ప్రజాతీర్పు**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ ఽ పీజీ కళాశాల పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రంలో దూరవిద్య డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎస్. ఓ కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ కే. రాజేంద్రం ఒక ప్రకటనలో తెలిపారు.కోర్సులు యూజీ బిఎ, బి కం, బీఎస్సీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల ఆగస్టు 7, 2026 లోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ద్వితీయ, తృతీయ సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులు కూడా తమ ట్యూషన్ ఫీజును నిర్ణీత గడువులోగా చెల్లించాలని వారు సూచించారు.అడ్మిషన్లు ఇతర పూర్తి సమాచారం కొరకు విద్యార్థులు 7382929775 మొబైల్ నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## హైదరాబాద్‌లో పారిశుధ్య కార్మికులకు పండ్ల పంపిణీ

జువ్వాడి నర్సింగరావు జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమం

**కోరుట్ల జూలై 4 (ప్రజాతీర్పు)**

కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి, తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ జువ్వాడి నర్సింగరావు జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని కొంపల్లి వెంకటాపూర్ ప్రాంతంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నసీర్, బాలు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు పండ్ల పంపిణీ చేశారు. సమాజ సేవలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని జువ్వాడి నర్సింగరావు గారికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు ఆశయ సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జువ్వాడి నర్సింగరావు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. వారి జన్మదినాన్ని పురస్కరించుకుని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానికులు, కార్యకర్తలు పాల్గొని పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహనీయుల సేవలు చిరస్మరణీయం

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జులై 4.**



దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించగా, కలెక్టర్ బి.సత్యప్రసాద్ హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు ఉద్యమ సాయుధ దశలో చేసిన పోరాటాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి కె. జయరాజ్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కిషన్, కలెక్టరేట్ సిబ్బంది, మరియు తదితరులు పాల్గొన్నారు.

## వరి నాట్ల జోరు.. కూలీలకు పెరిగిన డిమాండ్



**నిజాంసాగర్ మండలం జూలై 4 (ప్రజా తీర్పు)**

కామారెడ్డి జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. నిజాంసాగర్ మండలంలో రైతులు వరి నాట్లను వేగం గా చేపడుతున్నారు. ఒకేసారి పెద్ద ఎత్తున నాట్లు ప్రారంభం కావడంతో వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగి కొరత ఏర్పడింది. దీంతో రైతులు అధిక కూలి చెల్లించి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

## కురవి వీరభద్రస్వామి ఆలయంలో వరుస చోరీలు...

- ఆలయానికి వచ్చే భక్తులే లక్ష్యంగా దొంగల ముఠా...
- మహిళ వెండి పట్టీలు,భక్తుడి రూ.50 వేల నగదు అపహరణ
- ఫిర్యాదులు చేసినా ఆగని చోరీలు...
- విధుల్లో నిర్లక్ష్యం.. సత్రాల గదుల్లోనే సెక్యూరిటీ సిబ్బంది...
- ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దొంగలను పట్టుకోవాలని భక్తుల డిమాండ్

**కురవి జులై 04 (ప్రజా తీర్పు )**



తెలంగాణ లోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పేరు గాంచిన కురవి కురవి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయానికి దర్శనానికి వచ్చే భక్తులు వరుస చోరీలతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.గత కొన్ని రోజులుగా ఆలయ పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు భక్తులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.ఇటీవల ఓ మహిళ వద్ద నుంచి వెండి పట్టీలు దొంగిలించగా,రెండు రోజుల క్రితం మరో భక్తుడి వద్ద నుంచి సుమారు రూ.50 వేల రూపాయలు నగదును అపహరించినట్లు సమాచారం.ఈ ఘటనలపై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ చోరీలు మాత్రం కొనసాగుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆలయ భద్రత కోసం నియమించిన సెక్యూరిటీ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని,ఆలయ పరిసరాల్లో గస్తీ నిర్వహించాల్సిన సమయంలో సత్రాల గదుల్లో విశ్రాంతి తీసుకుంటూ మొబైల్ ఫోన్లలో నిమగ్నమవుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.దీంతో ఆలయానికి వచ్చే భక్తుల ప్రాణ,ఆస్తి భద్రత ప్రశ్నార్థకంగా మారిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ వందలాది మంది భక్తులు దర్శనానికి వచ్చే ఈ ప్రముఖ ఆలయంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని,సీసీ కెమెరాల పర్యవేక్షణను బలోపేతం చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.ఇప్పటికే జరిగిన చోరీలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిందితులను త్వరితగతిన గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆలయ అధికారులు,పోలీసు శాఖ సమన్వయంతో పటిష్ట భద్రతా చర్యలు అమలు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## గార్ల మండల కేంద్రంలో...ఘనంగా దొడ్డి కొమరయ్య వర్ధంతి

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) జూలై 4**



గార్ల. తెలంగాణ సాయుధ తొలి పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 80 వ వర్ధంతి సందర్భంగా స్థానికమండల కేంద్రంలోఅమరవీరుల స్థూపం వద్ద శనివారందొడ్డి కొమరయ్య చిత్రపటానికి సీనియర్ నాయకులైన పల్లెబోయిన లింగయ్య పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ. దొడ్డి కొమరయ్య నేటి యువతకు స్ఫూర్తిదాయకం అన్నారుదొడ్డి కొమురయ్య చరిత్ర గురించి తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇమ్మడి గోవిందు, మండల అధ్యక్షులు వడ్డెప్పుడు మల్లయ్య, తోట కొండలరావు గౌని మల్లేశం, ముంగి రాములు, జడ చిన్న శ్రీను, తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన పలు కేంద్రాలలో మరియు సిపిఎం సిపిఐ, న్యూ డెమోక్రసీ, ఆఫీసులలో కూడా దొడ్డి కొమురయ్య వర్ధంతి ఘనంగా జరిపినారు.

## ఘనంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి వేడుకలు

**జమ్మికుంట జూలై 04 ప్రజాతీర్పు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం జమ్మికుంట మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షత వహించగా, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ రోశయ్య ప్రజా సేవలను, ఆయన రాజకీయ జీవితాన్ని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రోశయ్య జయంతిని అధికారికంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రిగా రోశయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్లు, ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన కృషి, ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన నిజాయితీ, నిరాడంబరత, పరిపాలనా దక్షత యువతకు ఆదర్శంగా నిలుస్తాయని,




ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, కౌన్సిలర్లు చందా రాజు, దిడ్డి కోమల, ఒగ్గు రమేష్, గుర్రం కావ్య, లక్ష్మణ్, కొలుగూరి సురేష్, పొనగంటి విష్ణు, యాట్ల సునీత అశోక్, మాచర్ల రాజు, కుతాడి తిరుపతి, మున్సిపల్ అధికారులు జేఏవో రాజశేఖర్ రెడ్డి, ఏఈ వికాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఇన్‌చార్జ్) ఇల్లందుల రమేష్, దీపిక, టీపీబీవో, ఎం శ్రీనివాస్ సీనియర్ అసిస్టెంట్ , వార్డు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వానకాలం వ్యవసాయ సాగుకు సన్నద్ధం కావాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూలై 4**



రాష్ట్రంలో వానాకాలం వ్యవసాయ సాగుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, ప్రజారోగ్యం, పంటల వైవిధ్యీకరణ, రైతు రిజిస్ట్రీ, త్రాగునీరు, ఇరిగేషన్, విద్య, వాతావరణ మార్పులు, ఉద్యానవనం, సూక్ష్మ సాగునీరు, ఆయిల్ పామ్ విస్తరణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో వానాకాలం-2026 సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు రైతులను సమన్వయం చేసుకుంటూ సన్నద్ధం కావాలని తెలిపారు. రాష్ట్రంలో 138.49 లక్షల ఎకరాలలో సాగు లక్ష్యం నిర్దేశించడం జరిగిందని, రైతులకు అవసరమైన మేరకు 99.13 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే 510.93 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుని 68 మందిని అరెస్టు చేసి, 34 క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జూలై నెలకు అవసరమైన ఎరువులను ముందస్తుగా నిల్వ ఉంచాలని, యూరియా అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, నానో యూరియా వినియోగాన్ని కూడా విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందని, అర్హులైన ప్రతి రైతు నమోదు పూర్తయ్యేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యతనిస్తూ వరితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ఉద్యాన పంటల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టుల అమలులో జిల్లాల వారీగా పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రంలోని 33 జిల్లాలలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, జిల్లా, డివిజన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. సున్నిత ప్రాంతాలలో జ్వరాలపై ప్రత్యేక నిఘా చేపట్టి, ప్రతిరోజూ నివేదికలు పంపాలని, ప్రతి శుక్రవారం "డ్రై డే" కార్యక్రమం నిర్వహిస్తూ దోమల నివారణ చర్యలు, లార్వా నిర్మూలన, ఫాగింగ్, నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో శుభ్రత కార్యక్రమాలను ముమ్మరం చేయాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, పాఠశాలలు, వసతి గృహాలు, నిర్మాణ ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లు చేపట్టాలని, గత ఏడాదితో పోలిస్తే డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా కేసులు గణనీయంగా తగ్గినప్పటికీ, టైఫాయిడ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని, ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రులలో మందులు, పరీక్షా కిట్లు, రక్త నిల్వలు, అంబులెన్స్ సేవలు, అత్యవసర చికిత్స సౌకర్యాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్య, ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ, రెవెన్యూ శాఖలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, త్రాగునీటి నాణ్యత, పాఠశాలలు, వసతి గృహాల పరిశుభ్రత, ప్రజలలో అవగాహన కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని, ఆహార తయారీ నుంచి పంపిణీ వరకు పరిశుభ్రత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. విద్యార్థుల హాజరుకు అనుగుణంగా ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ఆధారంగా ఆహార అవసరాలను అంచనా వేసి వ్యర్థాలను నివారించాలని తెలిపారు. ఆహార నాణ్యత, పంపిణీ, పర్యవేక్షణ కోసం డిజిటల్ డ్యాష్‌బోర్డ్‌ను సమర్థంగా వినియోగించాలని, జిల్లా కలెక్టర్లు పథకం అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ వానాకాలంలో రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వానకాలం వ్యవసాయ సాగుకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతోపాటు ప్రత్యామ్నాయ పంటల సాగులో అవసరమైన మెలకువలు అందించడం జరుగుతుందని, రైతు నమోదు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. త్రాగునీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా మాధ్యమిక విద్యాధికారి అంజయ్య, మిషన్ భగీరథ ఈ.ఈ., సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 4**

ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అంతకుముందు నస్పూర్ మండల కేంద్రంలో గల ఈ.వి.ఎం. గోదాము వద్ద భద్రత చర్యలను పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వి.వి. పాట్ల భద్రతకు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని, సి.సి. కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లి ఎస్. ఐ ని మర్యాద పూర్వకంగా కలిసిన నంగారా భేరి ఎల్, హెచ్,పి ఎస్ నాయకులు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) జూలై 04**



లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలోనూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కె. తిరుపతి మర్యాదపూర్వకంగా కలిసి శాలలతో సన్మాన కార్యక్రమం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు, మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని,పోలీస్ శాఖ కృషి చేయాలని పోలీసులు-ప్రజల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి నంగారా భేరి భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు భూక్యా లాలు నాయక్,మండల అధ్యక్షుడు మూడ్ హుస్సేన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## వర్షం దాటికి కుప్ప కూలిన ఇల్లు

ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు విన్నపం

**అశ్వారావుపేట, జూలై 4,(ప్రజా తీర్పు )**

అశ్వారావుపేట మండల పరిధిలోని వినాయకపురం గ్రామ పంచాయతీలో గల దబ్బతోగు కాలనీలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దాటికి సున్నం శ్రీదేవి నివాసం ఉంటున్న తాటాకు ఇల్లు పూర్తిగా కుప్ప కూలిపోయింది. ఇంట్లోని ఉన్న సామగ్రి, నిత్యావసరాలు దెబ్బతినడంతో కుటుంబం రోడ్డున పడింది. తలదాచుకునే చోటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆమె కోరారు.



## బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా

శంతన్ రామరాజు జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్రకార్యదర్శి

**(పగడాలరామారావు) ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి ( జులై 4**

గార్ల. మహబూబాబాద్ బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా అని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. శనివారంనాడు రంగా 79వ. జయంతి వేడుకలను శ్రీరాం నగర్ బిసి కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా అంటే ప్రశ్నించే గొంతుక అని అన్నారు. 1947 జూలై 4న జన్మించి బెజవాడలో జన్మించిన రంగా తన జీవితమంతా పేదప్రజల కోసమే త్యాగం చేశారన్నారు. కార్మిక వర్గాలను ఏకం చేసి వారికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించిన దీశాలి రంగా అని అన్నారు. 1985లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా విజయం సాధించి తాను కోరుకున్న నవ సమాజ నిర్మాణం కోసం అలుపెరుగని పోరాటం చేశాడన్నారు. ఈక్రమంలో రంగా ఎదుగుదలను ఓర్వలేని పాలకులు అబద్రతాభావానికి అతని అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నారన్నారు. ప్రజల హక్కులకోసం ఆమరణన నిరాహార దీక్ష చేస్తున్న రంగాను బాంబుదాడితో అత్యంత పాషవికంగా హత్యచేశారని విచారం వ్యక్తంచేశారు. రంగాను హత్య చేసినంత మాత్రాన అయన చూపిన పోరాటస్ఫూర్తి ప్రజల్లో ఎప్పటికి నిలిచి ఉంటుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న రంగా జీవితం పాఠ్యపుస్తకాల్లో ప్రవేశ పెట్టాలాన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీఆరెస్ జిల్లా నాయకులు వేల్పుల లక్ష్మణ్ పటేల్, వేల్పుల శోభన్ బాబూ పటేల్, బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రెటరీ వీరమళ్ళ ప్రేమ్ రాయుడు పటేల్, కోరే ప్రసాద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## జూలై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేయాలి: చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ

**కోరుట్ల జూలై 4 (ప్రజాతీర్పు)**

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ "గో టు విలేజ్--40 డేస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు మారంపెల్లి వినోద్ మాదిగ, గ్రామ శాఖ అధ్యక్షుడు తరి పృథ్వీరాజ్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి కాశవతుల లక్ష్మీరాజం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపట్టిన "గో టు విలేజ్--40 డేస్" కార్యక్రమాన్ని విజయవంతం చేసి, ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్‌ను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మాదిగల ఆత్మగౌరవానికి ప్రతీకగా జూలై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. మాదిగల హక్కులు, అభ్యున్నతి కోసం ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని నాయకులు కోరారు. త్వరలో జరగనున్న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలు, మాదిగ సంఘ భవనాల్లో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దూడ మహేష్, చిట్యాల గంగాధర్, వేల్పుల సాయిబు, రాకేష్‌తో పాటు ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**జమ్మికుంట జూలై 04 ప్రజాతీర్పు**



అర్హులైన ప్రతి ఒక్కరూ నూతన ఓటర్ ఫారాలను పూర్తి చేసి వెంటనే సంబంధిత బీఎల్ఓలకు అందించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు. జమ్మికుంట పట్టణంలోని పలు పోలింగ్ బూతులలో బీఎల్ఏ-2లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త ఓటరుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, పాత ఓట్లు ఇక పని చేయవని స్పష్టం చేశారు. అధికారులు 2002 ఆధారంగా మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టారని, అట్టి ఓటర్ లిస్ట్ ఆధారంగానే మనకు ఇచ్చిన ఫారాలను నింపి, ఫోటో అంటిస్తేనే కొత్త ఓటు వస్తుందని, లేదంటే ఓటు హక్కు లభించదని ప్రజలకు వివరించారు. ఈ కీలక సమాచారాన్ని ప్రజలందరూ గమనించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకై బీఎల్ఓలు, బీఎల్ఏ-2లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంచుకుంటూ సమన్వయంతో నడుము బిగించాలని కోరారు. కొంతమంది బీఎల్ఓలు అధికార పార్టీ నాయకులను అనుసరిస్తూ ఇక్కడ లేని వారి పేరుతో దొంగ ఓట్ల నమోదుకు ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అలాంటి అక్రమాలను ముసాయిదా ఓటర్ లిస్టులో కచ్చితంగా తొలగిస్తామని, ఇందుకోసం బీజేపీ బీఎల్ఏ-2 ప్రతినిధులు అత్యంత పకడ్బందీగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. దొంగ ఓట్లకు ఏమాత్రం ఆస్కారం ఇవ్వకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటన కార్యక్రమంలో బీజేపీ ధార్మిక సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్ బచ్చు శివకుమార్, బీఎల్ఏ-2 ఎదలాపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బలోచిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి

### 30 మంది పాక్ భద్రతా సిబ్బంది మృతి

బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పాకిస్థాన్‌కు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నది. తాజాగా బలోచిస్థాన్‌లోని జివానీలో గల పాకిస్థాన్ కోస్ట్‌గార్డ్ శిబిరంపై ఆత్మాహుతి దాడి జరిపినట్టు ప్రకటించింది. ఈ ఘటనలో 30 మంది పాక్ జవాన్లు మరణించినట్టు పేర్కొన్నది. తమ ఫైటర్స్ శిబిరంలోకి చొరబడి, ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారని బీఎల్ఏ ప్రతినిధి మీడియాకు తెలిపారు. అయితే ఈ ఘటనలో మృతులకు సంబంధించి పాకిస్థాన్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తమకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, తమ ప్రాంతంలోని సహజవనరులపై తమకే నియంత్రణ ఉండాలని బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాద గ్రూప్ బీఎల్ఏ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో తరుచూ సైనిక, పారామిలిటరీ, ఇతర ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతున్నది. దీనిని పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

# జూలై 7న ఘనంగా సీత్ల పండుగ నిర్వహించాలి

- జె ఏ సి. మండల కమిటీ అధ్యక్షులు బోడ మురళి నాయక్ పిలుపు
- గిరిజనుల ఐక్యతే మన బలం సంస్కృతి పరిరక్షణే మన బాధ్యత..

**నర్సంపేట జూలై 4 ప్రజా తీర్పు**

గిరిజనుల ఆరాధ్య దైవమైన సీత్ల మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ.. ఈ నెల 07-07-2026 (మంగళవారం) నాడు చెన్నారావుపేట మండలంలోని అన్ని గిరిజన తండాల్లో సీత్ల పండుగను ఒకేసారి, ఐక్యంగా, అత్యంత ఘనంగా నిర్వహించాలని జేఏసీ మండల కమిటీ అధ్యక్షులు బోడ మురళి నాయక్ పిలుపునిచ్చారు. ?ఈ సందర్భంగా జె ఏ సి. మండల కమిటీ అధ్యక్షులు బోడ మురళి నాయక్ మాట్లాడుతూ సీత్ల పండుగ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది గిరిజనుల సంస్కృతి, సంప్రదాయం, ఐక్యత మరియు ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. మన పూర్వీకులు మనకందించిన ఈ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. ?చెన్నారావుపేట మండలంలోని గిరిజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు మరియు ప్రతి గిరిజన కుటుంబం ఈ పండుగలో భాగస్వాములు కావాలని కోరారు. తమ తమ తండాల్లో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో సీత్ల పండుగను విజయవంతం చేయాలని జె ఏ సి. మండల కమిటీ అధ్యక్షులు బోడ మురళి నాయక్ మనవి చేశారు.



# కబ్జాకు గురవుతున్న శుద్ధ కుంట చెరువు స్థలాన్ని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్తాం: అఖిలపక్ష సంఘం

**బోడుప్పల్, జూలై 4 (ప్రజాతీర్పు):**



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సుద్ద కుంట చెరువు స్థలం కబ్జాకు గురవుతున్న నేపథ్యంలో అఖిలపక్ష సంఘం నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే చెరువు భూములను ఆక్రమించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సుమారు ఆరు ఎకరాల 34 గుంటల విస్తీర్ణంలో ఉన్న సుద్ద కుంట చెరువులో ఇప్పటికే దాదాపు మూడు ఎకరాల భూమి కబ్జాకు గురైందని, మిగిలిన మూడు ఎకరాల స్థలాన్ని కూడా ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో చెరువు పూర్తిగా నశించే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష సంఘం అధ్యక్షుడు,నాయకులు మాట్లాడుతూ, చెరువు ప్రాంతం స్థానిక ప్రజల జీవనాధారానికి ఎంతో కీలకమని తెలిపారు. వర్షపు నీటిని నిల్వచేసే ఈ చెరువు ప్రాంతం నశిస్తే భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, పరిసర ప్రాంతాల్లో నీటి సమస్య మరింత తీవ్రమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారు లు వెంటనే స్పందించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. చెరువు భూములను సర్వే చేసి, అసలు పరిమితులను నిర్ధారించి, అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని కోరారు. అలాగే చెరువు చుట్టూ రక్షణ గోడ లేదా కంచె ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఇలాంటి కబ్జాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమని, చెరువు భూమిని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్తామని అఖిలపక్ష సంఘం నాయకులు హెచ్చరించారు. ప్రజల సహకారంతో ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. స్థానిక ప్రజలు కూడా చెరువు రక్షణ కోసం ముందుకు రావాలని, ఇది కేవలం ఒక భూమి సమస్య కాకుండా భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను కాపాడే పోరాటమని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు.



## సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు

**బీర్పూర్, జూలై 4 (ప్రజా తీర్పు ):**

బీర్ పూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు సీజనల్ మరియు అంటువ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సమన్వయ సమావేశంలో మండల పరిధిలోని అందరూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్, మరియు సూపర్‌వైజర్‌లు పాల్గొని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. గ్రామాలలోని వీధులు, డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేయాలని, ఇండ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసి దోమల వ్యాప్తిని అరికట్టాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగేలా అవగాహన కల్పించాలని, గ్రామాలలోని ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు నిరంతరం ప్రజల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేసి గ్రామాలను ఆరోగ్యవంతంగా ఉంచాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.

## షేర్స్ బజార్. పేరిట ప్రజలకు కుచ్చుటోపి పెట్టిన భూపాల్ నాయక్

- అధిక వడ్డీ ఆశ చూపి కోట్ల రూపాయలు టోకరా
- సైబరాబాద్ ఈ.ఓ.డబల్యూ అధికారాలు ల ను ఆశ్రయించిన బాధితులు...

**శేరిలింగంపల్లి, జూలై 4 (ప్రజా తీర్పు)**



అధిక వడ్డీలు ఇస్తామంటూ నమ్మబలికి, అమాయక ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలు వసూలు చేసి చేతులెత్తేసిన 'కిసాన్ పరివార్' సంస్థల నిర్వాహకుడు భూపాల్ నాయక్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. కిసాన్ పరివార్, కిసాన్ పరివార్ లిమిటెడ్, కిసాన్ పరివార్ ఇండస్ట్రీస్, షేర్స్ బజార్ పేరిట కంపెనీలను స్థాపించిన భూపాల్ నాయక్, పెట్టుబడిదారులను భారీగా ఆకర్షించి చివరకు బోర్డు తిప్పేశాడు.

**శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్ట్**

ఈ భారీ కుంభకోణానికి సంబంధించి గుజరాత్ పోలీసులు గతంలోనే భూపాల్ నాయక్‌పై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. కాగా, పది రోజుల క్రితం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న శంషాబాద్ పోలీసులు, తదుపరి విచారణ నిమిత్తం అతడిని గుజరాత్ పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం నిందితుడిని గుజరాత్ నుండి హైదరాబాద్‌కు తీసుకువస్తున్నట్లు సమాచారం.

**సైబరాబాద్ సీపీ ఆఫీస్ మెట్లెక్కిన బాధితులు**

తమకు జరిగిన అన్యాయంపై బాధితులు శనివారం సైబరాబాద్ సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2022 నుంచి తాము ఈ సంస్థలో పెట్టుబడులు పెడుతున్నామని, ప్రారంభంలో ఏడాది పాటు సక్రమంగానే వడ్డీలు చెల్లించి, ఆ తర్వాత నమ్మించి ముంచేశారని మీడియా ముందు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘోరంపై స్పందించిన పోలీసులు, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బాధితులకు హామీ ఇచ్చారు. ?ఈ కుంభకోణంలో దేశవ్యాప్తంగా సుమారు 6,000 మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే దాదాపు 1,200 మంది వరకు మోసపోయారు. మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా ఈ మోసం సాగింది. "నా కూతురి పెళ్లి కోసం దాచుకున్న డబ్బులన్నీ ఎక్కువ వడ్డీ వస్తుందనే ఆశతో ఇందులో పెట్టుబడి పెట్టాను. తీరా వీళ్లు బోర్డు తిప్పేయడంతో వేరే దారి లేక అప్పులు చేసి కూతురి పెళ్లి చేయాల్సి వచ్చింది. మాలాంటి మధ్యతరగతి వాళ్లంతా రోడ్డున పడ్డారు. ప్రభుత్వమే చొరవ తీసుకుని మాకు న్యాయం చేయాలి అన్ని వారు కోరారు. కంపెనీల పేరిట వేల కోట్లు వసూలు చేసిన ఈ భారీ స్కామ్‌పై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

## కడుపు నొప్పితో యువకుడు ఆత్మహత్య

**(చింతలపల్లి వేణు రెడ్డి ప్రజాతీర్పు బోయిన్పల్లి మండల రాజన్న సిరిసిల్ల ) జూలై 4**



జూలై 4 రోజున కొత్తపేట గ్రామానికి చెందిన న్యాలపల్లి వంశీకృష్ణ (26) అనే యువకుడు తీవ్ర కడుపు నొప్పిని భరించలేక తన అమ్మమ్మ నివసిస్తున్న మాన్వాడ గ్రామానికి వెళ్లి, ఆమె ఇంటిలో దూలానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి న్యాలపల్లి మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వేములవాడ రూరల్ సీఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు.

## ప్రియ నాయకుడు మేరుగు శివకోటి యాదవ్ అన్నకు జన్మదిన శుభాకాంక్షలు

**నర్సంపేట జూలై 4 ప్రజా తీర్పు**




సమాజ శ్రేయస్సు పట్ల అంకితభావంతో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎంతో మంది యువతకు స్ఫూర్తినిస్తూ.. జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వానికి, భావజాలానికి ఆకర్షితులై నిరంతరం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్న మా ప్రియతమ నాయకుడు, ప్రియ సోదరుడు నర్సంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ "మేరుగు శివకోటి యాదవ్" అన్నగారికి ఈ ప్రత్యేకమైన రోజున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. మీరు ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకొని మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనసారా కోరుకుంటున్నాము. జనసేన టీమ్- నర్సంపేట నియోజకవర్గం



## శ్రీ సరస్వతీ శిశుమందిర్ లో మాధవ ప్రతిభా పురస్కారాల అందజేత

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జూలై 04**

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది సందర్భంగా శ్రీరామ భక్తుడైన కొమ్మర చంద్రశేఖర్ రెడ్డి పూర్వవిద్యార్థి సంకల్పించిన విధంగా నరేంద్ర-వివేక కేశవ-మాధవ ప్రతిభా పురస్కారాలను శ్రీ సరస్వతీ శిశు మందిర్ కరింనగర్ లో గత సంవత్సరం నుండి అందజేస్తున్నారు. ప్రతి ఏడాదీ జూలై 4 వ తేదీన స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద మహాసమాధి దినాన్ని పురస్కరించుకొని పాఠశాలలో నిర్వహించే సభలో అందచేస్తారు. ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు క్లాస్ లో మొదటి ర్యాంకు సాధించిన ప్రతి విద్యార్థికి 1,116, రెండవ ర్యాంకు విద్యార్థికి 816, 3వ ర్యాంకు విద్యార్థులకు 616 రూపాయల నగదు మెరిట్ సర్టిఫికెట్లను అందచేయడం జరిగింది. అలాగే 6 నుండి పదవ తరగతి వరకు క్లాస్ లో మొదటి ర్యాంకు సాధించిన ప్రతి విద్యార్థికి 2,116 , రెండవ ర్యాంకు సాధించిన వారికి 1,516, మూడవ ర్యాంకు విద్యార్థులకు 1,316 రూపాయలు,మెరిట్ సర్టిఫికెట్లను అందచేశారు.ఈ సందర్భంగా ముఖ్యవక్త చార్టెడ్ అకౌంటెంట్ నిరంజనచారి అల్లూరి సీతారాములు గొప్పతనాన్ని గూర్చి విద్యార్థులకు వివరించారు. ప్రధాన ఆచార్యులు మోర రణధీర్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, కొమ్మెర ప్రవీణ్ కుమార్ రెడ్డి, కోల రామచంద్ర రెడ్డి, కొలుగూరి సదాశివ రెడ్డి, దేవరకొండ లక్ష్మణ్ మూర్తి, గుగ్గిళ్ల రమేష్, గుజ్జ శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.



## స్వర్గీయ కొనిజేటి రోశయ్య జయంతి సందర్బంగా ఘన నివాళులు

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 04**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ దివంగత కొనిజేటి రోశయ్య జయంతి సందర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఘనంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని దివంగత కొనిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోశయ్య ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన ఆదర్శ రాజకీయ నాయకుడని కొనియాడారు. ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన పట్ల ఆయన చూపిన నిబద్ధత భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొయినుద్దీన్ , వేణుమాధవ్ , అసిస్టెంట్ కమిషనర్ రాజ్ మనోహర్ , కార్పొరేటర్లు, మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఈ ఆర్వో రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో బీఎల్ఓలకు యాప్‌పై అవగాహన సదస్సు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) జూలై 04**

టేకులపల్లి :ఈ ఆర్ ఓ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం యొక్క జరిగింది ముఖ్య ఉద్దేశ్యం బీఎల్ఓలు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి సేకరించే విధానం, ఫారాలను సక్రమంగా నింపే విధానం, అలాగే బీఎల్ఓ యాప్‌లో సమాచారాన్ని ఎలా డిజిటలైజ్ చేయాలనే అంశాలపై అవగాహన కల్పించడం. ఈ సందర్భంగా బీఎల్ఓలు అడిగిన సందేహాలను నివృత్తి చేస్తూ వారికి శిక్షణ అందించబడింది.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రం ఐదుగురు సూపర్వైజర్లు మరియు 45 మంది బీఎల్ఓలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ముత్యాలంపాడు ఎక్స్ రోడ్ రైతు వేదికలోనిర్వహించబడింది.



## ఆర్థిక బలోపేతం వనరుల సమీకరణ రైస్ మిల్లర్లకు నోటీసులు జారీ

**కురవి జూలై 04 (ప్రజా తీర్పు)**

తెలంగాణ ప్రభుత్వం,పౌర సరఫరాలు సంస్థ, శాఖ ప్రత్యేకంగా చేపట్టిన కార్యక్రమం 'మిషన్ కె 100' కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని కురవి, మండలంలోని రైస్ మిల్లులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రబీ 2022-23 వేలం ధాన్యం ఖర్చులను మిల్లర్ల నుండి రావలిసిన మొత్తం సుమారు 90 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రబీ 2022-23 వేలం ధాన్యం ఖర్చులను మిల్లర్ల నుండి ఏడూ కోట్ల రూపాయలను వసూలు చేసిందని దీనిలో భాగంగా శనివారం కురవి మండలం అయ్యగారిపల్లి శ్రీ తిరుమల రైస్ ఇండస్ట్రీస్ మిల్లులను తనిఖీ చేసి వారు చెల్లించాల్సిన పద్దెనిమిది కోట్ల ఇరవై ఏడు లక్షలు (18.27 కోట్లు) లకు నోటీసులు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాలు అధికారి జే రమేష్,జిల్లా సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మేనేజర్ వి.నరసింహా రావు,కురవి మండల తహసీల్దార్ విజయ,మహబూబాబాద్ మండల రెవిన్యూ అధికారి రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య ఆశయ సాధన కు యువత ఉద్యమించాలి

- కరీంనగర్ లో దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 04**



భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధన కోసం నేటి యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం దొడ్డి కొమురయ్య 80 వ వర్ధంతి సందర్భంగా స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రీనివాస్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు దొరల ఆగడాలను ఎదిరించలేని స్థితిలో దొడ్డి కొమురయ్య ఒక వైపు దొరల గుండాల తూటాల ఎదురు నిలుచుని పేగులు బయటికి వస్తున్న ఆంధ్ర మహాసభకు జై అంటూ నేలకొరిగిన ఆయన తెగువ నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ కరీంనగర్ జిల్లాలో నేటికీ దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం అన్నారు. కడివెండి చుట్టూ పక్కల 40 గ్రామాలలో ఉద్యమాలు ఉవ్వెత్తున చెలరేగిన సమయంలో ప్రజలను ఐక్యపరచి పోరాటాలకు సిద్ధం చేసి సబండ వర్గాల స్వేచ్ఛ కోసం ప్రాణ త్యాగానికి కూడా వెనకాడని ధైర్యశాలి కొమురయ్య అని కొనియాడారు. అమరుల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం నేటికీ సమస్యలతో సతమతమవుతుందని అన్నారు. నీళ్లు, నిధులు, నిరుద్యోగం నేటికీ అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రజల జీవన స్థితిగతులు మారడం లేదని తెలిపారు. అమరులకు ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా లేదని ప్రజా వ్యతిరేక పరిపాలనపై ఉద్యమాలకు సిద్ధం కావాలని పంజాల శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు టేకుమల్ల సమ్మయ్య,పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కటిక రెడ్డి, బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, మచ్చ రమేష్, బూడిద సదాశివ నగర నాయకులు కసి బోసుల సంతోష్ చారి నునావత్ శ్రీనివాస్ నాయక్, భాకం అంజయ్య, అల్లెపు రాజు, కాల్వ శ్రీనివాస్ యాదవ్, రాము,సందీప్ రెడ్డి, బోయిని రాజయ్య తదితరులు పాల్గొన్నారు..

# ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలి

- అప్పుల పాలవద్దు.. నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వండి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన హౌసింగ్ పీడీ, కుభీర్ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) జూలై 04**



రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.5 లక్షల నిధులతోనే ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని, అదనపు అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు తెచ్చుకోవద్దని హౌసింగ్ పీడీ, కుభీర్ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. శనివారం కుభీర్ మండలంలోని పార్డి (బి), చాత, డోడర్నా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాల నాణ్యత, పురోగతిపై ఆరా తీసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్డి (బి) గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు షేక్ గఫూర్ ఉద్దీన్ సీనియర్ జర్నలిస్ట్ నివాసాన్ని సందర్శించిన శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వం అందిస్తున్న నిధులతో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్నందుకు ఆయనను అభినందించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకుని, అనవసరంగా అధిక ఖర్చులు చేసి అప్పుల పాలుకాకుండా ఇతర లబ్ధిదారులు కూడా ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ గృహ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకుని నాణ్యమైన ఇంటిని నిర్మించుకోవాలని, అవసరానికి మించి ఖర్చు చేయవద్దని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం పార్డి (బి) గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) ప్రక్రియను పరిశీలించారు. బీఎల్ఓలను వివరాలు అడిగి తెలుసుకుని, గ్రామంలోని ప్రతి అర్హ ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. తదుపరి చాత ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం డోడర్నా ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదీ, లేదీ స్వయంగా వారిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి విద్యా ప్రమాణాలు, పరిశుభ్రత, నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, స్థానిక సర్పంచులు ప్రవీణ్ కుమార్, రజిత, దేవేందర్, బిక్కులాల్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.



## ఇల్లందు 16వ వార్డులో వార్డు కమిటీ ఏర్పాటు ఘనంగా నిర్వహణ

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు) జూలై 04**

ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మిసతీష్ అధ్యక్షతన వార్డు కమిటీ ఏర్పాటు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడిందిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బోళ్ల సూర్యం హాజరై వార్డు కమిటీని అధికారికంగా ఏర్పాటు చేశారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్డు అభివృద్ధిలో వార్డు కమిటీ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వార్డులోని ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ భద్రం, కౌన్సిలర్ చిల్లా విజయభారతి, మహిళ పట్టణ అధ్యక్షురాలు స్వరూప, మహిళా కమిటీ సభ్యులు శ్వేత, మడుగు వెంకటలక్ష్మి, కమలమ్మ, చెంచమ్మ, మాజీ మైనార్టీ నాయకుడు ఖాదర్, నాయకులు వూట్ల రాజేష్, వూట్ల రాందాస్, నామవరపు సంజీవ్, బి ఎల్ ఏ సంతోష్, మౌలాలి, ఏర్పుల సంతోష్, గాయత్రి, చెరుకూరి వీరేందర్, సుజాత, నాగలక్ష్మి, ప్రసన్న, కళ్యాణ్, ఖాజా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు మహిళలు, వార్డు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సుభాష్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ద్వారంపూడి నాగిరెడ్డి నియామకం



**కుత్బుల్లాపూర్, జులై 4 (ప్రజా తీర్పు )**

నియోజకవర్గంలోని 290 సుభాష్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా ద్వారంపూడి నాగిరెడ్డిని నియ మించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ సహకారంతో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డిని ద్వారంపూడి నాగిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేస్తూ, డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పలు సూచనలు చేశారు. అనంతరం ద్వారంపూడి నాగిరెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా అవకాశం కల్పించిన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, మాజీ డీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, నిజాంపేట్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ నాయకులు, డివిజన్ నాయకులు మరియు కార్యకర్తలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ఏర్పడిన 290 సుభాష్ నగర్ డివిజన్‌కు తొలి కాంగ్రెస్ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తానని, డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. అలాగే డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళా అధ్యక్షురాలు తులసి, బాలాజీ, కొమరయ్య, మండల్, సలోమి, శైలజ, సాయి వర్మ, రవి, గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మమతకు మరో షాక్

టీఎంసీ అధ్యక్షురాలు, మాజీ సీఎం మమతా బెనర్జీకి వరుస షాకులు తగులుతున్నాయి. ఒక్కొక్కరుగా పార్టీని వీడుతూ రెబల్ టీమ్స్ లో చేరుతున్నారు. తాజాగా పార్టీ బెంగాల్ అధ్యక్షురాలు చంద్రిమ భట్టాచార్య తన పదవికి శనివారం రాజీనామా చేసి రెబల్ నేత రితబ్రత బెనర్జీ టీమ్‌లో చేరారు. నెల క్రితం ఆ పదవిలో ఉన్న సుబ్రతా భక్షి రెబల్ టీమ్‌లో చేరగా మమతా బెనర్జీ ఏరికోరి చంద్రిమకు పదవిస్తే ఆమె కూడా ఇప్పుడు అదే బాట పట్టారు. పార్టీలోని అన్ని పదవులకు రాజీనామా చేస్తున్నట్టు చంద్రిమ తన లేఖలో తెలిపారు. మమత పార్టీలో కష్టపడ్డవారికి ప్రయోజనం లేదని, ఆమె నిర్ణయాలపై నమ్మకం లేదని, అక్కడ పనిచేయడం వీలు కాక పదవులకు రాజీనామా చేస్తున్నట్టు చంద్రిమ భట్టాచార్య సోషల్ మీడియా పోస్టులో చెప్పుకొచ్చారు.



## కైతలాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కలికోట శంకర్

- బండి రమేష్ ఆశీస్సులతో బాధ్యతల స్వీకరణ
- రేవంత్ బాటలో సేవ చేస్తానని వెల్లడి

**కూకట్ పల్లి,జూన్04(ప్రజాతీర్పు)**

కైతలాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కలికోట శంకర్ నియమితులయ్యారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఆదేశాల మేరకు ఆయన ఈ పదవి చేపట్టారు.శనివారం బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. సీనియర్ నాయకుల మద్దతుతో తనను గుర్తించి అవకాశం ఇచ్చినందుకు బండి రమేష్‌కు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.బండి రమేష్ అడుగుజాడల్లో నడుస్తూ, రేవంత్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తా. ప్రజా సేవకు ఎప్పుడూ వెనుకాడను' అని శంకర్ అన్నారు. కార్యక్రమంలో మొఇజ్, యూత్ ప్రెసిడెంట్ సలీం, సుల్తాన్, శ్రవణ్, బాలకృష్ణ, నరేందర్, చిన్న, గౌస్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో గేదె మృతి.. రైతుకు తీరని నష్టం

**మంథని, జూలై-04 (ప్రజాతీర్పు)**



మంథని మండలం నాగేపల్లి గ్రామంలో విద్యుత్ ప్రవాహానికి గురై గేదె మృతి చెందడంతో రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతు కండెల పోచయ్యకు చెందిన గేదె పొలంలో మేత మేస్తుండగా విద్యుత్ స్థంభం సమీపంలో కరెంట్ ప్రవాహానికి గురైంది. ఈ ఘటనలో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూపాయలు 80 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ఒక్కసారిగా గేదెను కోల్పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని గ్రామస్థులు కోరారు. అలాగే ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



## స్వామి వివేకానందునికి వర్ధంతి నివాళులు

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 4.**

సామాజిక సమరసత వేదిక జగిత్యాల్ పట్టణ శాఖ ఆధ్వ ర్యంలో స్వామి వివేకానందుని వర్ధంతి కార్యక్రమాన్ని టవర్ సర్కిల్ సమీపంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి శనివారం ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ జిల్లా అధ్యక్షులు బొందుకూరు శ్రీనివాస్, సింహరాశి సూర్యనారాయణ లు మాట్లాడుతూ స్వామి వివేకానందని బోధనలు ఆచర ణీయమైనదని యువత వాటినీ ఆదర్శంగా తీసుకుని జాతి సమైక్యతకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కరీంనగర్ విభాగ్ సంయోజక్ చిట్ల గంగాధర్, ఇల్లెందుల పురుషోత్తం, చిట్ల రాజ మనోహర్ రెడ్డి, మండ లోజు ఉదయ భాస్కర్, సుద ర్శన్ తదితరులు పాల్గొన్నారు.



## ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

### తహసీల్దార్ దాసరి రాజమల్లు

**రామడుగు, జూలై 4 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని రామడుగు మండల తహసీల్దార్ దాసరి రాజమల్లు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు ఆధ్వర్యంలో రామడుగు మండలం వెదిర ఎక్స్‌రోడ్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు, ప్రజలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజమల్లు మాట్లాడుతూ, దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, సన్మార్గంలో నడుస్తూ వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్వల్పకాలం మాత్రమే జీవించినప్పటికీ తన దార్శనికతతో ప్రపంచవ్యాప్తంగా చిరస్థాయిగా నిలిచిన మహనీయుడిగా వివేకానంద గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఉప్పుల అంజనీ ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజీ హరీష్ లు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. ప్రభుత్వం స్వామి వివేకానంద జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించేలా ఎమ్మెల్యే, మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జిల్లా యువజన సంఘాల సమితి అధ్యక్షుడు, రేవెల్లి గ్రామ సర్పంచ్ బంధరపు అజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వ్యక్తిత్వమే మనిషికి నిజమైన సంపద అని, స్వామి వివేకానంద ఆశయాలతో యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నూతన యువజన విధానాన్ని ప్రకటించి, యువజన సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకోవడంతో పాటు స్వామి వివేకానంద జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శనిగరపు అంజన్ కుమార్, ఎంపీడీవో సంగీ రాజేశ్వరి, ఏపీఎం జ్యోతి, ఉపసర్పంచులు రాజిరెడ్డి, కటకం మనీష్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, కారోబార్ పన్యాల అశోక్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కలలను నిజం చేస్తున్న ప్రభుత్వం

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**రామడుగు/గంగాధర, జూలై 4 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



చొప్పదండి నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో ఒంటరి మహిళ, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు చింతల తాడేపు లక్ష్మీనర్సమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గంలో ఇప్పటివరకు 3,500 ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేసినట్లు తెలిపారు. మరో 2,000 ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రానున్న రోజుల్లో మరింత మంది అర్హులకు ఈ పథకం ప్రయోజనం అందేలా కృషి చేస్తామని చెప్పారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. ఇంకా ఇళ్లు రాని అర్హులైన పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇల్లు అందిస్తామని హామీ ఇచ్చారు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి అండగా నిలిచిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు లబ్ధిదారురాలు లక్ష్మీనర్సమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముద్దం నగేష్, పలువురు సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## రామగుండం సీపీ మరియు మంచిర్యాల డీసీపీ ఆదేశానుసారం చెన్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కౌన్సిలింగ్.

**(అరికిల్ల జయకుమార్ ప్రజా తీర్పు మంచిర్యాల మండల్) జూన్ 4**

గతంలో గంజాయి సంబంధిత కేసుల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, విద్య, ఉపాధి మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వివరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండి, సత్ప్రవర్తనతో సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని సూచించారు. తల్లిదండ్రులకు కూడా తమ పిల్లల ప్రవర్తనపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, చెడు స్నేహాలకు మరియు మాదక ద్రవ్యాల అలవాట్లకు దూరంగా ఉంచేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఒక వేళ గంజాయికి అలవాటు పడితే తమకు సమాచారం అందిస్తే వారిని డీ అడిక్షన్ సెంటర్ కు పంపడం జరుగుతుంది కౌన్సెలింగ్‌కు హాజరైన వారు ఇకపై గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన ఎటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనబోమని, మంచి పౌరులుగా జీవిస్తామని పోలీసుల సమక్షంలో హామీ ఇచ్చారు, ఆదేవిదంగా వారిపై నిరంతరం పోలీస్ నిఘా కొనసాగుతుందని మరల గంజాయి కలిగినా లేదా సేవిస్తూ పట్టుబడితే వారిపై పీడీ ఆక్ట్ సైతం నమోదు చేస్తామని తెలియచేసినాము. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100/112కు తెలియజేయాలని చెన్నూర్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేసారు.



## గోలిరామయ్యపల్లిలో చౌక్ ధరల దుకాణం ప్రారంభం

**రామడుగు, జూలై 4 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

రామడుగు మండలంలోని గోలిరామయ్యపల్లి గ్రామంలో నూతన చౌక ధరల (రేషన్) దుకాణాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రామడుగు తహసీల్దార్ దాసరి రాజమల్లు ముఖ్య అతిథిగా హాజరై దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి నాణ్యమైన నిత్యావసర సరుకులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో గోలిరామయ్యపల్లి సర్పంచ్ నునుగొండ అంజలి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజీ హరీష్, రేషన్ డీలర్ శంకర్, సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఉప్పుల అంజనీ ప్రసాద్, ఉపసర్పంచ్ వేల్పుల అరుణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం, అంజయ్య, శ్రీనివాస్, జవ్వాజీ అజయ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజన పథకానికి వంట పాత్రలు అందించిన చింతలపెల్లి వేణు రావు

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట)జూలై 4**

కందికట్కూర్ ప్రభుత్వ పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట పాత్రలను అందజేసిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతలపల్లి వేణు రావు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపా ధ్యాయులు ఉప సర్పంచ్ అజయ్ వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పండరి పూర్ పాదయాత్రకు వెళ్లే భక్తులకు సన్మానించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) జూలై 04**



నిర్మల్ జిల్లా భైంసా నుండి పండరిపూర్ పాద యాత్రకు వెళ్లే భక్తులకు శనివారం భైంసా లోని ఎస్. ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ లో ఘనంగా స్వాగతం పలికారు. భక్తులకు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సన్మానించి శాలువా తో సత్కరించి పాదయాత్ర ప్రారంభించారు. మహారాష్ట్ర సంప్రదాయం ప్రకారం అనవాయితీ గా నియమ నిష్టలతో వెళ్లడంతో భక్తితో పాటు ఐక్యత భావం, పెంపొందుతుందన్నారు..ఆషాడ ఏకాదశి సందర్భంగా ఈ యాత్ర లో లక్షలాది భక్తులు పాల్గొనడం దేశం లోనే ప్రత్యేకమన్నారు.దిండి పాదయాత్ర భక్తి, క్రమ శిక్షణ, సేవా,సామరస్యత ఆచరించే ఆధ్యాత్మిక సంప్రదాయం అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పాల్గొన్నారు.

# అశ్వారావుపేట మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

- గాంధీ బొమ్మ సెంటర్ విస్తరణ, పక్కా డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- స్వచ్ఛ భారత్ 2.0, వనమహోత్సవం--2026 అమలుకు కీలక తీర్మానాలు: కమిషనర్ దిలీప్ రెడ్డి

**అశ్వారావుపేట,జూలై 4,(ప్రజా తీర్పు )**



అశ్వారావుపేట మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక తీర్మానాలను మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆమోదించినట్లు మున్సిపల్ కమిషనర్ తూడి దిలీప్ రెడ్డి తెలిపారు. సమావేశంలో గాంధీ బొమ్మ సెంటర్ విస్తరణ, పక్కా డ్రైన్ల నిర్మాణం, పట్టణ సుందరీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో మురుగునీటి పారుదల సమస్యల పరిష్కారానికి అవసరమైన కల్వర్టుల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన నిర్మాణ పనులను చేపట్టాలని కౌన్సిల్ నిర్ణయించింది. రానున్న వనమహోత్సవం--2026 విజయవంతంగా నిర్వహించేందుకు మొక్కల కొనుగోలు, నాటేందుకు కార్మికుల నియామకం, ట్రీ గార్డుల కొనుగోలు తదితర ప్రతిపాదనలకు కూడా సమావేశంలో ఆమోదం లభించింది. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుధ్య సేవలు, పర్యావరణ పరిరక్షణ, పట్టణ సుందరీకరణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కౌన్సిల్ నిర్ణయించినట్లు కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జాపల్లి శశికళ, వైస్ చైర్మన్ జాపల్లి రమేష్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ వేములి సురేష్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితుడి గుర్తింపు

- అనుమానితున్ని గుర్తిస్తే సమాచారమివ్వండి
- హుస్నాబాద్ సీఐ శ్రీను, ఎస్సై లక్ష్మారెడ్డి

**హుస్నాబాద్ జులై 04 ప్రజాతీర్పు**



హుస్నాబాద్ లో ఇటీవల జరిగిన వరుస చోరీల కేసుల్లో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు దొంగతనాల కేసుల్లో అనుమానితుడిగా ఉన్న వ్యక్తి రౌత్ ప్రవీణ్ గా గుర్తించారు. దీంతో శనివారం నిందితుడు యొక్క కొన్ని ఫోటోలు విడుదల చేసి కొంతమేరకు పురోగతి సాధించారు. అయితే అనుమానితుడిని ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే హుస్నాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫోటోలో అనుమానితుడైన వ్యక్తి కనిపించినా లేదా ఆచూకీ తెలిసినా స్వయంగా ఎదుర్కొనే ప్రయత్నం చేయకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులు కోరారు. అలాగే ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. నేరాలను అరికట్టడంలో పోలీసులు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు కాబట్టి అనుమానితున్ని గుర్తించిన వెంటనే హుస్నాబాద్ సీఐ 8712667351 , ఎస్సై 8712667352 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.



## కోర్టును మరో చోటుకి తరలించొద్దు ఆర్డీవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి

**హుస్నాబాద్ జులై 04 ప్రజా తీర్పు**

హుస్నాబాద్ కోర్టును మరో చోటుకి తరలించొద్దని బీఆర్ఎస్ నాయకులు ఆర్డీవోకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లెలగడ్డ గ్రామ పరిధికి తరలించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు హుస్నాబాద్ ఆర్డీవో రామమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...సుమారు 20 సంవత్సరాల క్రితం ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పట్టణంలో కోర్టు భవనం నిర్మించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్త కోర్టు భవనాల నిర్మాణం పేరుతో పట్టణానికి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలోని జిల్లెలగడ్డ గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిలో కోర్టు నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతోందని తెలిపారు.ప్రస్తుతం కోర్టు ఉన్న ప్రదేశంలోనే సుమారు ఒక ఎకరం 30 గుంటల స్థలం అందుబాటులో ఉందని, అక్కడే ఆధునిక కోర్టు భవనాలను నిర్మించాలని కోరారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా పాత కోర్టులనే అదే ప్రాంతంలో అభివృద్ధి చేశారని, హుస్నాబాద్ కోర్టును మాత్రం బయటకు తరలించడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని పేర్కొన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకుని కోర్టును ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే కొనసాగించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, సూరంపెల్లి పరశురాములు, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, భూక్యా తిరుపతి, మాటూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



## మంథనిలో స్వామి వివేకానందకు ఘన నివాళి

**మంథని, జూలై-04 (ప్రజాతీర్పు)**

స్వామి వివేకానంద 124వ వర్ధంతి సందర్భంగా మంథని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విగ్రహ ఫౌండర్ అండ్ చైర్మన్ బెజ్జంకి డిగంబర్ మాట్లాడుతూ.. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. భారత సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. కార్యక్రమంలో బిజెపి మాజీ పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి, కాంగ్రెస్ నాయకుడు ఏల్పుల సత్యం, ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు కనుకుంట్ల స్వామి, మంథని రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో వర్షపు నీటితో దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు

**మంథని, జూలై-04 (ప్రజాతీర్పు)**



మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ సంగెం అరుణ గట్టయ్య దృష్టికి తీసుకెళ్లగా, ఆమె వెంటనే స్పందించి టిప్పర్ ద్వారా కంకర చిప్స్ తెప్పించి ట్రాక్టర్ సహాయంతో చిప్స్ వేయించి రోడ్డును ప్రయాణానికి అనుకూలంగా మార్చే చర్యలు చేపట్టారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి తాత్కాలిక పరిష్కారం కల్పించిన సర్పంచ్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- ఉపాధి హామీ పనిదినాలు 125కు పెంపు
- తక్కువ వర్షపాతం నేపథ్యంలో ఆరుతడి పంటలే మేలు
- అధికారులతో వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 4**



జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీరాజ్ ఏఈలు, ఏపీఎంలతో కలెక్టర్ వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోని ముఖ్య అంశాలను అధికారులకు వివరించారు. ఈ వానాకాలంలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయం, త్రాగునీరు, విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అంశాల్లో నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. వీబీజీ రాంజీ పథకం కింద ఉపాధి హామీ పనిదినాలను 125 రోజులకు పెంచినట్లు కలెక్టర్ తెలిపారు. పెంచిన పనిదినాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణ, ఇంకుడు గుంటల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పొదుపు సంఘాల రుణాల బకాయిలను కాలంలో వసూలు చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, జెడ్పీ సీఈవో శిరీష, డిపిఓ యాదగిరి, హౌసింగ్ పీడీ సిద్దార్థ, డీఈఓ అశోక్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు

# కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బందితో సమావేశం

- కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా కృషి చేయాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా ఐపిఎస్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 4**




జిల్లాలోని పోలీస్ స్టేషన్ల నుండి కోర్టు విధుల పర్యవేక్షణ కోసం పనిచేస్తున్న కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బందికి ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ కోర్టు విధుల నిర్వహణకు సంబంధించి సలహాలు సూచనలు అందించారు, పనిలో నాణ్యత, పారదర్శకత ఉండాలని అని అన్నారు, పెండింగ్ ఉండకుండా పని చేయాలి, కోర్టు వారెంట్, సమన్ లు సకాలంలో అందజేయాలి, సిబ్బంది కోర్టులలో సమన్వయంగా, సమయపాలనతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు కేసుల స్థితిగతులను రికార్డులలో, అంతర్జాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. బాధితులను, సాక్షులను, నిందితులను సకాలంలో కోర్టులకు ప్రవేశపెట్టి కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని సూచించారు. కేసుల్లో త్వరితగతిన నేరస్తులకు శిక్షలు అమలు అయితేనే క్షేత్రస్థాయిలో నేరాలను అదుపు చేయవచ్చు అని సూచించారు. లక్ష్యంతో పని చేయాలని కోర్టు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేసుకోవాలని సూచించారు. ఈ సమావేశం నందు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి రవి, ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కోర్టు డ్యూటీ పోలీస్ సిబ్బంది ఉన్నారు

# భారత్‌కు భంగపాటు

## రెండో టీ20లో ఇంగ్లండ్ గెలుపు



భారీ అంచనాల మధ్య 15 ఏండ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టిన మ్యాచ్‌లో భారత్ బోల్తా కొట్టింది. స్పిన్నర్ రవి బిష్ణోయ్ చెత్త బౌలింగ్ కారణంగా ఇంగ్లండ్ టూర్‌ను ఓటమితో ఆరంభించింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా శనివారం రాత్రి జరిగిన రెండో మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో ఓడిపోయింది. భారత్ ఇచ్చిన 191 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లిష్ టీమ్ 19 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జాకబ్ బెథెల్ (46 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 76 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్‌తో ఆ జట్టును గెలిపించాడు. అర్ష్‌దీప్ సింగ్ (3/40) పోరాటం వృథా అయింది. టాస్ ఓడిన భారత్ తొలుత 190/7 స్కోరు చేసింది. ఇషాన్ (49), అభిషేక్ (24 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 43), కెప్టెన్ శ్రేయస్ (37) రాణించారు. బెథెల్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. మూడో టీ20 మంగళవారం జరుగుతుంది.

**తలో చేయి..**

సంజూ శాంసన్ స్థానంలో ఓపెనర్‌గా బరిలోకి దిగిన సూర్యవంశీ ఆర్చర్ మెరుపు వేగంతో వేసిన బాల్‌ను స్కూప్ షాట్‌తో సిక్స్, టంగ్ ఓవర్లో మరో సిక్స్‌తో అలరించి విల్ జాక్స్ బౌలింగ్‌లో స్టంపౌటయ్యాడు. మరో ఓపెనర్ అభిషేక్ పవర్‌ప్లేలో భారీ షాట్లు కొట్టాడు. కరన్ వేసిన ఆరో ఓవర్లో మూడో ఫోర్లు బాది ఆఖరి బాల్‌కు ఔటయ్యాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఇషాన్, శ్రేయస్ అడపాదడపా బౌండరీలు కొడుతూ మూడో వికెట్‌కు 65 పరుగులు జోడించారు. సామ్ కరన్ (3/33) బౌలింగ్‌లో ఇషాన్, హిట్టర్ శివం దూబే (5) ఔటవగా.. ఆల్‌రౌండర్ అక్షర్ (2) రనౌటయ్యాడు. కానీ, ఆర్చర్ వేసిన ఆఖరి ఓవర్లో తిలక్ వర్మ (24 నాటౌట్) 6, 6,4 సహా 17 పరుగులు స్కోరును 190కి చేర్చాడు.

**బెథెల్‌ను అడ్డుకోలేక**

లక్ష్య ఛేదనకు దిగిన ఇంగ్లండ్‌ను తొలి ఓవర్లోనే ఫిల్ సాల్ట్ (0), జోస్ బట్లర్ (0)ను గోల్డెన్ డకౌట్స్ చేసిన భారత పేసర్ అర్ష్‌దీప్ దెబ్బకొట్టాడు. కానీ, కెప్టెన్ హ్యారీ బ్రూక్ (15 బంతుల్లో 39).. అర్ష్‌దీప్ వేసిన మూడోఓవర్లో వరుసగా 4,4,6,6,6తో 27 రన్స్ పిండుకొని కౌంటర్ ఎటాక్‌కు దిగాడు. కానీ ఐదో ఓవర్లో అక్షర్ బాల్‌ను వెంటాడిన బ్రూక్.. కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. స్పిన్నర్ల బౌలింగ్‌లో కాసేపు జాగ్రత్త పడ్డ టామ్ బాంటన్ (39), బెథెల్, చక్రవర్తి వేసిన పదో ఓవర్లో 6, 4తో ఒక్కసారిగా గేరు మార్చి భారీ షాట్లు కొట్టారు. 24 బంతుల్లో 49 రన్స్ అవసరమైన దశలో కెప్టెన్ శ్రేయస్ 17వ ఓవర్లో స్పిన్నర్ బిష్ణోయ్‌ను బౌలింగ్‌కు దింపడం కొంపముంచింది. రెండు నోబాల్స్ సహా బిష్ణోయ్ వేసిన చెత్త బంతులకు బెథెల్ 3 సిక్సర్లు, ఓ ఫోర్ సహా 29 పరుగులు రాబట్టి ఇంగ్లండ్ విజయం ఖాయం చేశాడు.

**సంక్షిప్త స్కోర్లు:**

**భారత్: 20 ఓవర్లలో 190/7 (ఇషాన్ 49, అభిషేక్ 43, కరన్ 3/33).**

**ఇంగ్లండ్: 19 ఓవర్లలో 191/6 (బెథెల్ 76 నాటౌట్, బ్రూక్ 39, అర్ష్‌దీప్ 3/40).**



# కార్యకర్తలకు అండగా ఉంటా: బండి సంజయ్

**కోరుట్ల జూన్ 04 (ప్రజాతీర్పు)**

కోరుట్ల పట్టణానికి విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ పాలుపంచుకుంటానని, ఏ కార్యకర్తకు ఎలాంటి ఆపద వచ్చినా పార్టీ తరఫున అండగా ఉంటానని మరోసారి హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ కార్యక్రమాలతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పిండం గణేష్, బీజేపీ నాయకులు జక్కుల ప్రవీణ్ కుమార్, రుద్ర విఘ్నేష్, పోతుగంటి శ్రీనివాస్, సాడిగ మహేష్, గుండేడి సంజీవ్, కళల సాయిచంద్, దమ్మ సంతోష్, దేశ్ముఖ్ జీవన్, వాసాల నవీన్, గుండేటి సాయికుమార్, బేగ్యారపు అభిషేక్, మిట్టపల్లి రవి, జిల్లా ఉదయ్, కంఠం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవ్ వచ్చేశాడు..

## సచిన్ 37 ఏండ్ల ఆల్‌టైమ్ రికార్డు బ్రేక్ చేసిన సూర్యవంశీ



బీహార్‌కు చెందిన 15 ఏండ్ల వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట దాదాపు 37 ఏండ్లుగా ఉన్న ఆల్‌టైమ్ రికార్డును అధిగమించాడు. 15 ఏండ్ల 99 రోజుల వయసులోనే వైభవ్ ఈ మైలురాయిని అందుకోగా, సచిన్ టెండూల్కర్ 1989లో తన 16 ఏండ్ల 205 రోజుల వయసులో పాకిస్థాన్‌పై తొలి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. భారత టీ20 122వ ఆటగాడిగా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ నుంచి వైభవ్ బ్లూ క్యాప్ అందుకున్నాడు. కాగా, అతి పిన్న వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన రికార్డు రొమేనియాకు చెందిన మరియన్ గెరాసిమ్ (14 ఏండ్ల16 రోజులు) పేరిట ఉంది.



# నా అలవాటు మార్చుకోను

ఎన్ఐఏ ఏజెంట్ వైష్ణవిగా 'స్పై' సినిమాతో తెలుగు చిత్రసీమకు పరిచయమైన నటి ఐశ్వర్య మేనన్. ఆ తరువాత 'భజే వాయు వేగమ్'తో మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ రెండు చిత్రాలూ ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా.. తనకంటూ ఫ్యాన్ ఫాలోయింగ్ పెంచుకున్నది ఈ భామ. ఒకవైపు కన్నడ, తమిళ్, మలయాళ సినిమాల్లో నటిస్తూనే మరోవైపు టాలీవుడ్‌లోనూ పాగావేసిన ఈ ముద్దుగుమ్మ ఈసారి 'నాగబంధం'తో రంగంలోకి దిగింది. ఈ సందర్భంగా ఆమె పంచుకున్న కార్‌వాన్ కబుర్లు ఇవి. మాది వాస్తవానికి కేరళం రాష్ట్రం. కొన్ని కారణాల వల్ల తమిళనాడులోని ఈరోడ్‌కు వలసొచ్చి అక్కడే స్థిరపడ్డాం. దీంతో నా బాల్యమంతా తమిళనాడులోనే గడిచింది. బీటెక్ వరకు చదువుకున్న నాకు సినిమాల్లో నటించాలనే బలమైన కోరిక ఉండేది. ఆ ఆసక్తితోనే అవకాశాల కోసం ప్రయత్నించి కోలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చాను. నాకు సంతోషం వచ్చినా, బాధ కలిగినా సోషల్‌మీడియాలో వ్యక్తం చేయడం అలవాటు. బాధకంటే ఆనందాన్నే ఎక్కువగా పంచుకుంటాను. ఓ సందర్భంలో నా ఫొటోలను పోస్ట్ చేయగా.. సినిమా ఆఫర్ల కోసం ఇలాంటి ఫొటోలు పోస్ట్ చేస్తుందని చాలామంది బ్యాడ్ కామెంట్లతో విమర్శించారు. నన్ను ద్వేషించేవారికి నేను చెప్పేది ఒక్కటే. మీరు ఎగతాళి చేసినా, విమర్శించినా ఒకరికోసం నా అలవాటును మార్చుకోను.

# అది నిజం కాదు



తన సినిమాపై సాంఘిక మాధ్యమంలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై కథానాయిక కీర్తి సురేశ్ కౌంటరిచ్చింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా రూపొందుతున్న భారీ చిత్రంలో కీర్తి సురేశ్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె వెంకటేష్ జోడీగా నటిస్తున్నది. ఈ సినిమా.. మలయాళంలో 2024లో వచ్చిన 'గురువాయూర్ అంబలనాదయిల్' చిత్రం రీమేక్‌గా తెరకెక్కుతున్నదని ఇన్‌స్టాలో ఎవరో పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. దానికి కీర్తి సురేశ్ స్పందిస్తూ.. 'అందులో ఏ మాత్రం నిజం లేదు. ఇది కొత్త కథ. అందరూ మెచ్చే కథ' అంటూ కామెంట్ పెట్టింది. దీంతో వెంకీ, కల్యాణ్‌రామ్ చిత్రంపై వస్తున్న గాలి వార్తలకు చెక్ పెట్టినట్టయింది.



# గత్తరలేపిన రెజీనా కాసాండ్రా.. అమ్మడి ఫోటోలకు ఫిదా అవ్వాల్సిందే..

రెజీనా కాసాండ్రా.. ఈ అందాల భామ ఒకానొక సమయంలో టాప్ హీరోయిన్ గా రాణించింది. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగు, తమిళం,కన్నడ సినిమాల్లో నటిస్తూ అలరిస్తుంది. ఈ ముద్దుగుమ్మ 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. చిన్న వయస్సులోనే సినిమా రంగంలోకి అడుగుపెట్టిన రెజీనా, 2005లో తమిళ చిత్రం "కండా నాల్ ముదల్"తో తన నటనా జీవితాన్ని ప్రారంభించింది. తెలుగులో "శివ మనసులో శృతి" ద్వారా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో ఆమె నటనకు "సైమా ఉత్తమ తొలి చిత్ర నటి" అవార్డు కూడా వచ్చింది. రెజీనా తెలుగులో "రొటీన్ లవ్ స్టోరీ", "పిల్లా నువ్వు లేని జీవితం", "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్", "పవర్" వంటి సినిమాల్లో నటించి క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. తమిళంలో "కేడి బిల్లా కిల్లాడి రంగా", "మానగరం" వంటి చిత్రాల్లో ఆమె నటన ప్రశంసలు పొందింది. ఈ బ్యూటీ విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటుంది. "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్"లో సాంప్రదాయ అమ్మాయి, "జ్యో అచ్యుతానంద"లో స్టూడెంట్, "అ"లో డ్రగ్ అడిక్ట్ వంటి పాత్రల్లో తన సత్తా చాటింది. ఈ భామ బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టింది. 2019లో "ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా" చిత్రంతో హిందీలో ప్రవేశించింది. తాజాగా విడుదలైన సన్నీ డియోల్ "జాట్" చిత్రంలో కీలక పాత్రలో కనిపించింది. అలాగే, వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ తన సత్తా చాటుతుంది.



# 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్

కన్నడ అగ్రనటుడు శివరాజ్‌కుమార్ ప్రధాన పాత్ర పోషిస్తున్న స్పై డ్రామా '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. డాలీ ధనంజయ, ప్రియాంక మోహన్, అదితి బాలన్ కీలక పాత్రధారులు. హేమంత్ ఎం.రావు దర్శకుడు. వైశాఖ్ జె.గౌడ నిర్మాత. ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. అనుభవం ఉన్న ఏజెంట్, వృద్ధిలోకి రావాలనుకుంటున్న ఏజెంట్, మాస్క్ మేన్, వీళ్లందరి కళ్లుగప్పే ఓ నీచుడు, ఓ తల్లి.. ఈ పాత్రల చుట్టూ ఈ కథ నడుస్తుందని టీజర్ తెలిపింది. టీజర్‌లోని ప్రతి అంశం సినిమాపై ఆసక్తిని పెంచింది. ఇందులో ఏజెంట్ ప్రకాష్‌గా శివరాజ్‌కుమార్ కనిపించారు. ఆయన స్క్రీన్‌ప్రెజెన్స్ ఈ టీజర్‌కి హైలైట్. డాలీ ధనంజయది ఇందులో కీలకమైన పాత్ర అని టీజర్ చూస్తే అర్థమవుతుంది. వింటేజ్ సినిమా గురించి వినడమే తప్ప ఇప్పటివరకూ చూడని వారికి, ఈ సినిమా ఓ కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని, సాంకేతికంగా ఇదొక అద్భుతమని, ఆడియన్‌ని ఓ వినూత్న ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: అద్వైత గురుమూర్తి, సంగీతం: చరణ్‌రాజ్.



Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020